
BALA CHELIMI

BALA

DEC 2025

DEC



PRGI Regn. No. 52828/1992

₹40

డిసెంబర్ - 2025

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

# BALA CHELIMI

Telugu Children's Monthly Magazine

సంపుటి : 35 • సంచిక : 3

DECEMBER - 2025




**NIKHAT ZAREEN**

WORLD BOXING CUP FINALS - 2025

INDIA'S FIFTH GOLD MEDAL, WOMEN'S CATEGORY

Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA



## DECEMBER 2025

Our students, showcasing cultural pride through exhilarating dance.


Oxford Grammar High School

#Street No. 13, Himayathnagar, Hyderabad

Ph : 040 2763 6214, +91 99590 20512

www.oxfordgrammarschool.com


ogs JUNIORS

44 YEARS OF MERITORIOUS PERFORMANCE

| Sun | Mon | Tue | Wed | Thu | Fri | Sat |
|---|---|---|---|---|---|---|
| | 1 | 2 | 3 | 4 | 5 | 6 |
| 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| 14 | 15 | 16 | 17 | 18 | 19 | 20 |
| 21 | 22 | 23 | 24 | 25 | 26 | 27 |
| 28 | 29 | 30 | 31 | | | |
| | | | | | | |

**Important Dates**

25 Dec - Christmas

26 Dec - Boxing Day

NOTES :


The harder you work for something, the greater you'll feel when you achieve it.


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

# బాలచెలిమి

పిల్లల వికాస పత్రిక


| సంపుటి: Volume: 35 | సంచిక : Issue : 3 | హైదరాబాద్ Hyderabad | డిసెంబర్ December | పేజీలు Pages 52 | రూ. ₹. 40 |
|---|---|---|---|---|---|





లోపలి పేజీల్లో.......




| | | |
|---|---|---|
| నేనూ... నా లైబ్రరీ | మణికొండ వేదకుమార్ | 5 |
| ప్రపంచ ఆధునిక గణిత శాస్త్ర చరిత్రలో భారతీయ కీర్తి పతాక శ్రీనివాస రామానుజన్ (సైంటిస్ట్) | జుగాష్‌విలి | 6 |
| ఉడుతా సాయం (ఇంటర్నేషనల్ వాలంటీర్ డే) | డా. నీరజ అమరవాది | 7 |
| రాణీ గైడిన్ ల్యూ | షీరోస్–256 | 9 |
| గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం (అక్షరం) | డా॥ జనపాల శంకరయ్య | 10 |
| ప్రవళిక పట్టుదల (కథ) | కొట్టె మేఘన | 11 |
| టాటూకు టాటా చెప్పేద్దాం (కథ) | యం. రాం ప్రదీప్ | 13 |
| లండన్ బ్రిడ్జి(ఆట) | చిన్ననాటి ఆటలు–జ్ఞాపకాల మూటలు | 14 |
| బంగారు మర్రి – 7 (సీరియల్) | పైడిమర్రి రామకృష్ణ | 15 |
| బొమ్మలేద్దామా... | | 16 |
| వేమన పద్యాలు | | 16 |
| మొక్కల ఎంపిక (కథ) | సంగనభట్ల చిన్న రామకిష్టయ్య | 17 |
| అక్షరాల జాడ – పదాల క్రీడ (అక్షరాలతో ఆటలు) | డా. చొక్కాపు వెంకటరమణ | 18 |
| బాలచెలిమి దేవరకొండ గ్రంథాలయాన్ని సందర్శించిన లయన్ సముద్రాల ధనుంజయ | బాలచెలిమి డెస్క్ | 18 |
| కోట లింగాల (యాత్ర) | దేశరాజు శ్యాంసుందర్‌రావు – స్థపతి | 19 |
| అగ్నికి వాయువు శత్రువా?(సైన్స్) | డాక్టర్ మహీధర నళినీ మోహన్ | 20 |
| అతిథి దేవో భవ (లఘునాటిక) | డా. సమ్మెట విజయ | 21 |
| ఎఫ్.ఎం. రేడియో ఆవిష్కర్త & ఆధునిక రేడియో పితృ ఎడ్విన్ హౌవర్డ్ ఆర్మ్ స్ట్రాంగ్(సైన్స్ వెన్నెల–14) | డా. నాగసూరి వేణుగోపాల్ | 24 |
| కొబ్బరి చెట్టు (చెట్టు – చేమ) | కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి | 25 |
| రైతుల పండుగ (కార్టూన్) | జుగాష్ విలి | 26 |
| పంచ్‌ల పవర్... పతకాల శవర్! (స్పోర్ట్స్) | బాలచెలిమి డెస్క్ | 28 |
| పంట బీమా ప్రతి రైతుకు రక్ష (కథ) | డా.వాసరవేణి పర్శరాములు | 29 |
| కోతి మేకు కథ | పంచతంత్ర కథ | 30 |
| మాయా ఉంగరం (అనువాద కథ) | అనిల్ బత్తుల | 31 |
| చెన్నై ఎంజిఆర్ సెంట్రల్‌లో ప్రత్యేక బుక్ వెండింగ్ మెషీన్ ప్రారంభం | | 32 |
| ముగ్గురు కొడుకులు (కథ) | షన్మాతురా | 33 |
| లాజికల్ రీజనింగ్& ఆల్ఫాబెట్ టెస్ట్ | బాలచెలిమి డెస్క్ | 34 |

రెండు వేల ఏళ్ళ కిందటి జైన మతం (చరిత్ర పాఠాలు-10) ............................. డా. ద్యావనపల్లి సత్యనారాయణ ........... 35
పొద్దు (పాట)... ............................................................................ గంగదేవు యాదయ్య ......................... 36
కీలుగుర్రం (పాట) ......................................................................... డా. ఎన్. గోపి ............................... 36
బొమ్మలేద్దామా... ......................................................................... ............................................... 36
బూజు నుండి పెన్సిలిన్ మందు ......................................................... బాల కథా సౌరభం ......................... 37
9తో అద్భుతం (మాథ్స్ ట్రిక్స్) ............................................................ అంకెల మామయ్య చంద్రయ్య............. 38
చెలిమి క్లబ్............................................................................... బాలచెలిమి ................................. 38
డిజిటల్ ప్రపంచంలో విప్లవాత్మక మార్పు (విద్య)........................................ లత ........................................... 39
మానవతే మహాశక్తి (కథ)................................................................ వేధాంశ్ గౌడ్ ............................... 41
నేర్చుకుందామా............................................................................ ............................................... 42
కలం-చెలిమి .............................................................................. ............................................... 42
భారతదేశం రాష్ట్ర ముఖ్యమంత్రులు & గవర్నర్లు (జి.కె.)................................ బాలచెలిమి డెస్క్.......................... 43
అక్షర మాత సన్నిధి - అపూర్వ విజ్ఞాన నిధి.............................................. శ్రీ కోణం పర్శరాములు ................... 45
పగడపు తీగల రక్షకుడు, సముద్ర సౌందర్యానికి ప్రతీక హాక్స్‌బిల్ తాబేలు (పక్షి)........ సచిన్ కోత్వాల్ ............................ 46
బాలచెలిమి జాతీయ కథల పోటీ ఫలితాలు - 2025 .................................... గరిపల్లి అశోక్ ............................. 47
సమాచారం ................................................................................ బాలచెలిమి డెస్క్.......................... 49
గ్రామీణ సాంస్కృతిక జ్ఞాపకాల ప్రతిరూపం: పద్మశ్రీ షేక్ నాజర్ (వ్యక్తిత్వం)............ సువేగా....................................... 50


# చెలిమి లేఖలు

బాలచెలిమి పత్రిక అరుదైన, ఆకర్షణీయమైన శీర్షికలను మాత్రమే కాకుండా, పిల్లలు నేర్చుకోవలసిన విలువైన అంశాలను సృజనాత్మకంగా అందించడం అభినందనీయం. ఉపాధ్యాయులకు ముందుచూపును పెంపొందిస్తూ, వైవిజ్ఞాన్ని మరియు నైపుణ్యాన్ని అభివృద్ధి చేసే దిశగా ఈ పత్రిక అమోఘంగా నిలుస్తోంది. ప్రతి శీర్షిక ఆనందభరితంగా, పాఠకులను ఆకట్టుకునే విధంగా ఉండటం నాకు వ్యక్తిగతంగా ఎంతో సంతోషాన్ని కలిగిస్తోంది. బాలచెలిమి పత్రిక సంపాదకులు మరియు సభ్యులందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు.

**- రాంబాబు,** శ్రీకాకుళం

బాలచెలిమి పిల్లల్లో ఆసక్తిని, సృజనత్మాకతను పెంచుతూ.. అందరికీ అందుబాటులో ఉన్న ఒక చక్కటి శీర్షికతో ఆకర్షవంతంగా పేరుపొందింది. ఇందులో వచ్చే కథలు, సమాచార వ్యాసాలు, వినోదాత్మక అంశాలు పిల్లలు సులభంగా అర్థం చేసుకునే రీతిలో ఉన్నాయి. చాలా మంది తల్లిదండ్రులు ఈ పత్రిక పిల్లలలో భాషా నైపుణ్యం, సృజనాత్మకత, నైతిక విలువల పెంపుదల, గ్రంథాలయం సేవలు కూడా పిల్లలకు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని నా అభిప్రాయం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చదువు వనరులు పరిమితంగా ఉన్నప్పుడు బాలచెలిమి గ్రంథాలయం పిల్లలకు కొత్త పుస్తకాలు చదివే అవకాశం కల్పించింది.

**- శివ శంకర్,** హైదరాబాద్


వేద కుమార్ గారూ, నమస్తే! ఈ నెల బాల చెలిమి మధ్యలో మడత పెట్టకుండా, కవర్‌లో పెట్టి పంపించారు. ఎంతో ముచ్చటగా కనిపించింది పుస్తకం.అందుకే వెంటనే సంవత్సర చందా కట్టాను.

**-మాచిరాజు కామేశ్వర్ రావు**

*Cover Picture*

NIKHAT ZAREEN

World Boxing Cup Finals - 2025
India's Fifth Gold Medal,
Women's Category



*బొమ్మలు:*
కూరెళ్ల శ్రీనివాస్,
m : 98495 43728


సంపాదకులు : మణికొండ వేదకుమార్

BALA CHELIMI
**"CHANDRAM"** 3-6-712/2, St.No.12,
Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balachelimi.com
Mob: 98480 44713

# నేనూ... నా లైబ్రరీ

పిల్లలూ.... నవంబర్ 14-20 తేదీలలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు విజయవంతంగా జరిగాయి. మీరూ ఎన్జాయ్ చేసే వుంటారు. ఇంటర్నెట్ మన జీవితాల్లోకి ప్రవేశించిన తర్వాత పుస్తకాలు చదవడం తగ్గిందనే మాట నిజమే కాని పూర్తి నిజం కాదు. మార్కులు, ర్యాంకులు ఒత్తిడి మధ్య కూడా, ఆన్‌లైన్ గేమ్స్‌తో బిజీగా వుంటూ కూడా విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు వివిధ రకాల పాఠ్యేతర గ్రంథాలను చదువుతున్నారు. జిల్లాల నుంచి, పాఠశాలల నుంచి పిల్లలు రాసిన కథలు అనేక సంపుటాలుగా వస్తున్నాయి. దీనికి పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రుల ప్రోత్సాహం ప్రధాన కారణం. దీనితో పాటు ఆయా పాఠశాలల్లో గ్రంథాలయాలను ఉపయోగించుకుంటున్న తీరు ఆనందదాయకం. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ బాలల కోసం బాలచెలిమి ముచ్చట్లు నిర్వహణతో పాటు, వివిధ జిల్లాల పిల్లలు రాసిన కథలను, పెద్దలు రాసిన పిల్లల కథలను, పర్యావరణ పోటీ కథలను, అనేక సంపుటాలుగా ప్రచురించింది. బాలచెలిమి మాసపత్రికను మీ రచనలతో, మీకు ఉపయోగపడే విషయాలలో మీకు అందిస్తూ ఉంది. ఇటీవల బాలచెలిమి పిల్లల నుంచి, పెద్దల నుంచీ పిల్లల కథలను ఆహ్వానించగా కనీ వినీ ఎరుగని రీతిలో వందలకొద్దీ కథలు వచ్చాయి. వాటిలో ఎంపిక చేసిన కథలు పుస్తక రూపంలో తెచ్చే ప్రయత్నం జరుగుతుంది.

పిల్లల కోసం చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ఇప్పటికే పలు పాఠశాలల్లో బాలచెలిమి గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. మరెన్నో గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తుంది. ఈ పుస్తకాలన్నీ మీ ఆలోచనా శక్తిని, సృజనాత్మక శక్తినీ, వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంచుతాయి. సమాచారంతో పాటు, విజ్ఞాన వికాసానికి, వివిధ అంశాలపై సరైన అవగాహన పెంచడానికి దోహదం చేస్తాయి. బాలచెలిమి గ్రంథాలయాలను విద్యార్థులు చక్కగా ఉపయోగించుకుంటున్నారు. వారిలో రచనాసక్తిని పెంచాయి. వీళ్ళు కథలు రాస్తున్నారు. వివిధ కార్యక్రమాల్లో అక్టివ్‌గా ఉంటున్నారు.

మీరు కూడా మీ పాఠశాలల్లో, మీ ఊరిలో వున్న గ్రంథాలయాలు ఉపయోగించుకోవాలి అంతే కాదు మీ ఇంటిలో, మీ కోసం మీ స్వంతంగా ఒక లైబ్రరీని ఏర్పాటు చేసుకోవాలి. మీ పాకెట్ మనీతో పుస్తకాలు కొనుక్కోవడం అలవాటు చేసుకోవాలి. ఆ పుస్తకాలను దాచుకోవడానికి బుక్‌షెల్ఫ్‌లు ఏర్పాటు చేసుకోవాలి. మీ అమ్మా నాన్నలను పుస్తకాలు కావాలని, బుక్‌షెల్ఫ్‌లు కావాలని అడిగి సమకూర్చుకోవాలి.

డిసెంబర్ 19 నుంచి 29 వరకు హైద్రాబాద్ ఎన్‌టిఆర్ స్టేడియంలో, జనవరి 1 నుంచి విజయవాడలో బుక్ ఎగ్జిబిషన్లు జరుగుతున్నాయి. మీ కోసం ప్రత్యేక బుక్‌షాపులుంటాయి. బాలచెలిమి ప్రచురణలతో మీకోసం బుక్‌స్టాల్ ఉంటుంది. మీ అమ్మా నాన్నలతో, ఉపాధ్యాయులతో, మీ స్నేహితులతో ఒక విహార యాత్రలా ఈ ఎగ్జిబిషన్‌లకు వెళ్ళండి. పుస్తకాలతో పాటు, పుస్తక రచయితలు, వేర్వేరు పాఠశాల విద్యార్థులు కనిపిస్తారు. వారితో సంభాషించండి. ఇది మీ ఆలోచనల్ని, ప్రవర్తనలను ఆరోగ్యవంతమూ, ఆనందదాయకమూ చేస్తుంది.

తల్లిదండ్రులూ... మీ పిల్లల్ని ప్రోత్సహించండి. ఈ ప్రోత్సాహం వారు ఆరోగ్యవంతమైన ఆలోచనతో ఎదగడానికి, జీవితంలో స్థిరపడటానికి, ఉత్తమ పౌరులుగా మానవీయ విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి కారణమవుతుంది.

పిల్లలూ!

'నేనూ... నా లైబ్రరీ'... ఈ ఊహ ఎంత అందంగా ఉంది... ఎంత ఆనందంగా ఉంది.


ఒకసారి ఊహించి చూడండి.

మీ

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి





సైంటిస్ట్

# ప్రపంచ ఆధునిక గణిత శాస్త్ర చరిత్రలో భారతీయ కీర్తి పతాక

# శ్రీనివాస రామానుజన్



శ్రీనివాస రామానుజన్ ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త. భారత దేశపు గణిత శాస్త్రానికి ప్రపంచ స్థాయిలో చిరస్థాయి కీర్తిని సంపాదించారు. రామానుజన్ 1887 డిసెంబర్ 22న తమిళనాడులోని ఈరోడ్‌లో నిరుపేద కుటుంబంలో జన్మించారు. చిన్నప్పటి నుంచి గణితం పట్ల ఆసక్తి ఎక్కువ. 13 సంవత్సరాల వయస్సులో ట్రిగన్‌మెట్స్ పై ఆధునిక పరిజ్ఞానం సాధించారు. కుంభకోణం టౌన్ హై స్కూల్‌లో చదువుతున్నప్పుడే జి.ఎస్. కార్ రాసిన “సినాప్సిస్ ఆఫ్ ఎలిమెంటరీ రిజల్ట్స్ ఇన్ ప్యూర్ మేథమేటిక్స్”తో ప్రేరణ పొందారు. 1912లో మద్రాస్ ఫోర్ట్‌లో ఉద్యోగం చేసారు. ఆ సమయంలోనూ గణిత శాస్త్ర పరిశోధనలను కొనసాగించారు. లండన్‌లోని కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి చెందిన జి. హెచ్. హార్డీ పిలుపుతో 1914లో కేంబ్రిడ్జిలోని ట్రినిటీ కాలేజీలో చేరి 1916లో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ బై రిసెర్చ్ డిగ్రీని పొందారు. ట్రినిటీ కాలేజీలో గణిత సాధన కొనసాగిస్తూనే ప్రధానంగా సంఖ్యావాదం వంటి వివిధ అంశాలలో కొత్త సిద్ధాంతాలు, ఫార్ములాలను అందించారు.

ప్రధాన సంఖ్యలపై రామానుజన్ నంబర్ 1729 ప్రపంచ ప్రఖ్యాతి పొందింది. రామానుజన్ సంక్షిప్త సిద్ధాంతం, continued fractions, infinite series, elliptic function వంటి రంగాల్లో అవిరళ కృషి చేసారు.

1918లో రామానుజన్ రాయల్ సొసైటీ ఆఫ్ లండన్ ఫెలోగా ఎంపికయ్యారు. ఈ ఫెలోకి ఎంపికయిన తొలి భారతీయుడు సర్ రామానుజన్. లండన్‌లో వాతావరణం సరిపడక తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. 1919లో ఇండియాకి తిరిగి వచ్చాడు. 1920 ఏప్రిల్ 26న 32 సంవత్సరాల వయస్సులో మరణించారు. రామానుజన్ గణిత సేవలు, నోట్స్, ప్రపంచ గణిత శాస్త్రవేత్తలకు స్ఫూర్తిగా నిలిచాయి. రామానుజన్ జీవితం, సాహిత్యం, ఆవిష్కరణలు, భారతీయ గణితశాస్త్ర చరిత్ర, ప్రపంచ గణిత శాస్త్ర ఆధునిక చరిత్రలో చెరగని ముద్ర వేస్తున్నాయి. రామానుజన్ జయంతి డిసెంబర్ 22న జాతీయ గణిత దినోత్సవంగా భారతీయ సమాజం సగర్వంగా జరుపుకుంటోంది.

– జుగాష్విలి
బాలచెలిమి డెస్క్, m : 83094 52998




పిల్లలూ బాగున్నారా. డిసెంబర్ నెలలోనే చాలా స్కూళ్లల్లో 'స్కూల్ డే', 'స్పోర్ట్స్ డే' లు జరుపుతుంటారు కదా. మీరు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొంటారా. ఏంటి.! మీలో కొందరు వాలంటీర్‌గా పేరు ఇచ్చారా. అంటే మీరే కార్యక్రమ నిర్వాహకులు. ఇది అక్షర సత్యం. పెద్ద, పెద్ద కార్యక్రమాల వెనుక వాలంటీర్ల పాత్ర మరువలేనిది. వారే కార్యక్రమం విజయవంతం కావడానికి వెన్నెముక లాంటి వారనచ్చు. మన శీర్షిక "ఉడుతా సాయం" చూడగానే మీ పాఠ్యభాగం 'ఉడుతా భక్తి' గుర్తు వచ్చిందనుకుంటాను.

వాలంటీర్ అనే పదానికి స్వచ్ఛంద సేవ అని అర్థం చెప్పుకోవచ్చు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు మేమున్నామని చేయూతనిస్తూ, మానవత్వాన్ని చాటుకోవడమే స్వచ్ఛంద సేవకుల లక్ష్యం.

"The best way to find yourself is to lose yourself in the service of others". - Mahathms Gandhi.

ఏ స్వార్థం లేకుండా పరులకు సేవ చేయడమనేది అనుకున్నంత చిన్న విషయం కాదు. ముఖ్యంగా ప్రకృతి విపత్తుల సమయంలో, యుద్ధాలు, అనుకోని ప్రమాదాలు, ఉగ్రవాద చర్యల వల్ల నష్టపోయేది, ప్రాణాలను కోల్పోయేది అమాయక ప్రజలు. అందులోను స్త్రీలు, పిల్లలే ఎక్కువగా ఉంటారనేది నిర్వివాదాంశం. ఇటువంటి సమయంలో ఒక్కోసారి ధనం కన్నా మనిషి సాయం చాలా అవసరం. అందుకనే మాట్లాడే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అంటారు. మన రెండు చేతుల్లో ఒకటి మనకోసం, మరొకటి సమాజం కోసం అని భావించాలి. రెడ్ క్రాస్, లయన్స్ క్లబ్స్, రోటరీ క్లబ్స్ లాంటి పలు జాతీయ, అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థలు ఎన్నో రకాలుగా ఆదుకుంటున్నాయి. విశ్వశాంతి స్థాపనకి ఈ స్వచ్ఛంద కార్యకర్తలు తమ సహకారాన్ని అందిస్తూ సమాజాభివృద్ధికి పాటుపడుతున్నారు.

ముఖ్యంగా ప్రపంచ యుద్ధాల సమయంలో, భూకంపాలు, సునామీలు సంభవించినప్పుడు ఊహించలేనంత ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగినప్పుడు నేనున్నానని స్నేహ హస్తాన్ని నిస్వార్థంగా అందించేవాడే వాలంటీర్. కొంత మంది ఆర్థిక సాయం చేస్తారు. మరి

కొందరు వస్తురూపేణ సాయం చేస్తారు. ఉదాహరణకు చలికాలంలో అవసరమైన వారికి దుప్పట్లను పంచడం, ఎండాకాలంలో మంచినీరు, మజ్జిగ లాంటివి అందించడం, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అవసరమైన కోచింగ్, పుస్తకాలను ఇవ్వడం మొదలైనవి. వాలంటీర్ ల ఆవశ్యకత, సేవను, వారి అవసరాన్ని గుర్తించి UNO 1985లో డిసెంబర్ 5వ తేదీని అంతర్జాతీయ వాలంటీర్ దినోత్సవం (International volunteer day)గా ప్రకటించింది.

ప్రభుత్వ సంస్థలు, లాభాపేక్షలేని సంస్థలు, కమ్యూనిటీ గ్రూపులు, అకెడెమియా, ప్రైవేట్ రంగాలలోని వారు తమ ఉత్తమ నైపుణ్యాలను, అపార విజ్ఞానాన్ని, అనుభవాలను, విలువైన సమయాన్ని సమాజాభివృద్ధికి కోసం కేటాయిస్తున్నారు. 'ది పవర్ ఆఫ్ కలెక్టివ్ ఆక్షన్' అంటే అందరం కలిసి చేస్తే అసాధ్యాలను సాధించవచ్చు. అంతర్జాతీయ స్థాయిలో ఈ వాలంటీర్లందరూ సమాజాభివృద్ధికి తమ సహకారాన్ని అందిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా 970 మిలియన్ల పైగా వాలంటీర్లు ఉన్నారు. వీరందరు ఒక ప్రత్యేక వెబ్ సైట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. అందులో ప్రతి సంవత్సరం వారు చేసిన సేవాకార్యక్రమాల గురించి, అవి ప్రజల జీవితాలలో ఎలా మార్పుతేగలిగాయో వివరిస్తూ కథనాలను కూడా పోస్ట్ చేస్తారు.

విద్యార్థిదశ నుండే పిల్లలలో సేవాభావాన్ని జాగృతం చేయడానికి NSS, NCC లాంటి విభాగాలు కృషి చేస్తున్నాయి. యువతలో కూడా నిస్వార్థ సేవాభావాన్ని పెంపొందించడానికి, సమాజాభివృద్ధిలో వారి పాత్రకూడా అవసరమని తెలియజేయడానికి NGO లు రక్తదాన శిబిరాలను, అవగాహన సదస్సులను నిర్వహిస్తారు. ఈ స్ఫూర్తితోనే అనేక గ్రామాలలోని ప్రజలే వారి గ్రామాలకు రోడ్లను వేసుకున్నారు. స్వచ్ఛభారత్‌లో భాగంగా టాయ్‌లెట్లను నిర్మించుకున్నారు. గోడలు పడిపోతున్న విద్యాలయాలకు మరమ్మత్తులు చేసుకున్నారు. వాలంటీర్‌లు ఒక జాతి సామాజిక, ఆర్థికాభివృద్ధిలో ముఖ్య భాగస్వామ్యాన్ని పోషిస్తున్నారు. వివిధ సంస్థల్లో నిస్వార్థంగా పనిచేస్తున్న వాలంటీర్లందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, డిసెంబర్ 5న వారిని తగిన విధంగా గౌరవించు కుంటారు.

పిల్లలూ... ఏ పనినైనా ఇంటి నుంచే మొదలు పెట్టాలంటారు. అందుకే మీరు ముందుగా మీ అమ్మానాన్నలకి ఇంటి పనులలో సాయపడండి. మీ చుట్టు పక్కల జరిగే ఉత్సవాలు, పండుగలలో ఉత్సాహంగా పాల్గొంటూ కావలసిన ఏర్పాట్లలో చేయికలపండి. దీని వల్ల మీరు అందరితో స్నేహాన్ని పెంపొందించుకోగలుగుతారు. చిన్నతనం నుండి నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుంటారు. మీ విద్య, ఉద్యోగ అవకాశాలకు ఇవి చాలా ఉపయోగపడతాయి.

"We make a living by what we get, but we make a life by what we give – Winston Churchill".

**– డా. నీరజ అమరవాది**
m : 9849160055


చందదారులుగా చేరండి! **బాల చెలిమి** చందదారులను చేర్పించండి!

SCAN & PAY

'యం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balachelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సంllలకు : రూ. 750
'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010

# రాణీ గైడిన్ ల్యూ

### స్వేచ్ఛా యోధురాలు, ప్రతిఘటనకు ప్రతీక

రాణీ గైడిన్‌ల్యూ (1915 జనవరి 26 -1993 ఫిబ్రవరి 17) నాగా నాయకురాలు, స్వాతంత్ర్య సమరయోధురాలు.

నాగా సమాజాన్ని ప్రక్షాళించడానికి, బ్రిటిష్ పాలనను వ్యతిరేకించడానికి మతపరమైన హెరాకా ఉద్యమంలో 13 సంవత్సరాల వయస్సులో గైడిన్ ల్యూ చేరారు. బ్రిటిష్‌కు వ్యతిరేకంగా జెలియన్ గ్రాంగ్ ప్రజలకు సమీకరించిన ఆమె నాయకత్వం ప్రతిఘటనకు చిహ్నంగా, ప్రజలకు స్ఫూర్తిగా నిలిచింది.



పదహారు సంవత్సరాల చిరు వయస్సులో 1932లో రాణీ గైడిన్ ల్యూను బ్రిటిష్ వారు అరెస్టు చేసి జీవిత ఖైదు విధించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత 1947లో ఆమె విడుదల అయ్యారు. రాజకీయ ఖైదీలలో ఆమె అతి పిన్న వయస్కురాలు, ఎక్కువ కాలం జైలులో గడిపారు. జైలు నుంచి విడుదలైన తరవాత సామాజిక సేవ, విద్య, దేశీయ సంప్రదాయాలను కాపాడటానికి గైడిన్ ల్యూ తన జీవితాన్ని అంకితం చేశారు. ఈశాన్య భారత సామాజిక - సాంస్కృతిక కృషిలో ఆమె ముఖ్య వ్యక్తిగా మారారు.

పద్మభూషణ్ (1982) సహా అనేక అవార్డులు రాణీ గైడిన్‌ల్యూను వరించాయి. ఆమె గౌరవార్థం అస్సామ్‌లోని సిల్చార్‌లో ఆమె విగ్రహంతో పార్కును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆమె గౌరవార్థం భారత ప్రభుత్వం 1996లో ఒక తపాలా బిళ్ళను, 2015లో స్మారక నాణాన్ని విడుదల చేసింది.

భారత దేశ స్వాతంత్ర్య కోసం ఆమె చేసిన పోరాటం, సాహసం అచంచలమైన ఆమె స్ఫూర్తికి చిహ్నంగా మిగిలిపోతాయి.

**- 'షీరోస్-256**
**ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....**

## మీకు తెలుసా?

గైడిన్‌ల్యూను 'పర్వతాల కుమార్తె'గా నెహ్రూ అభివర్ణించారు, ధైర్యానికి 'రాణీ' అనే బిరుదును ఆమెకు అందించారు.



# 1991 - ఆంధ్రప్రదేశ్ విద్యాపథకంలో - భాగంగా గేయాన్ని చార్టులపై రాసి అక్షరాన్ని గుర్తింపజేయడం- గుర్తించే అక్షరాన్ని ఎర్రని సిరాతో రాయడం



డమడమ డప్పుల చప్పుడు విన్నారా?
డమరుకం చప్పుడు వింటున్నారా?
"డంక" చప్పుడు శివుని గుడిలోనే
"డంక" మొదటి అక్షర మేది? "డ" అక్షరం



ఢమ ఢమ మంటే చప్పుడని తెలుసా?
ఢకీలు అంటే కొమ్ముల రాపిడని ఎరికేనా?
"ఢక్క" అంటే డమరువు అని తెలుసా?
"ఢక్క" లో మొదటి అక్షరమేది? "ఢ" అక్షరం



'ణ' అంటే భూషణమని తెలుసా?
'ణ' అంటే పానీయనిలయమని తెలుసా?
గణము అంటే గుంపు అని తెలుసా?
'ఋణము'లో నడుమ అక్షరమేది? "ణ" అక్షరం



తబలను తాకితే తకదిమి అని మోగుతుంది
తడక చాటున తల దువ్వుతుంది మరదలు
తంబుర వాయిస్తున్నడు ఓ సాధువెందుకు
"తంబుర"లో మొదటి అక్షరమే ముంది? "త" అక్షరం



సీతారాములు 'కథ' విన్నారా?
పంచతంత్ర కథలు విన్నారా?
రథములో సీతారాములు ఊరేగుతున్నారు
"రథము" నడుమ ఏ అక్షరముంది? "థ" అక్షరం

- డా|| జనపాల శంకరయ్య
m : 8074727108

కథ

# ప్రవళిక పట్టుదల




అనగనగా జడల చింత అనే ఊరిలో భద్రం మరియు లక్ష్మీ అనే దంపతులు ఉండే వాళ్ళు. వాళ్ళకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి పేరు లక్ష్మణ్.అమ్మాయి పేరు ప్రవళిక.

లక్ష్మణ్ కు ఐదు సంవత్సరాలు నిండగానే ప్రైవేటు బడికి పంపించారు.అమ్మాయికి అబ్బాయికి ఒక సంవత్సరం తేడా కావడంతో ముందు అబ్బాయిని పంపించారు.అలా సంవత్సరం గడిచింది. లక్ష్మణ్ రెండో తరగతిలోకి వచ్చాడు.

ప్రవళిక ఎంతో ఉత్సాహంగా తాను కూడా బడికి వెళ్ళవచ్చు అనుకుంది. కానీ ఆ అమ్మాయిని బడికి పంపియ్యలేదు.

తనను ఎందుకు పంపించడం లేదో తెలుసు కుందామని "అమ్మా! నాన్నా! నన్ను బడికి ఎందుకు పంపించడం లేదు?" అని అడిగితే వాళ్ళ నాన్న "మీ అన్నయ్యను పంపించడానికే అప్పు తెచ్చి ఫీజు కడుతున్నాం. నిన్ను పంపించడానికి డబ్బులు ఎక్కడివమ్మా?" అన్నాడు.

అప్పుడు ప్రవళిక "నన్ను గవర్నమెంట్ బడికి పంపు నాన్నా! అక్కడ డబ్బులు అవసరం లేదు. అందులో చదువుకుంటాను" అనగానే.

"ఏ బడీ లేదు. నువ్వేదో బాగా చదువుతా అన్నట్లు బడికి వెళ్తాను అని ఒకటే అడుగుతున్నావు? నోర్మూసుకో!" కోపంగా అన్నాడు.

అప్పుడు అక్కడే ఉన్న వాళ్ళ అమ్మ కూడా "ఇప్పటి నుంచే నువ్వు ఇంటిపని, వంటపని, కూలిపని మంచిగా నేర్చుకోవాలి" అంటుంది.

తల్లి మాటలకు ఏడుస్తూ రోజూ ఇంట్లో అన్ని పనులు చేస్తూ, తల్లితో కలిసి కూలిపనికి వెళ్ళి వస్తోంది.

అలా సంవత్సరం గడిచింది.

చదువుకోవాలనే ఆశతో మళ్ళీ అమ్మానాన్నలను బడికి పంపమని అడిగితే మళ్ళీ "చదువు లేదు, గిదువు లేదు" అని కోపంతో తిడతారు.అలా మరో సంవత్సరం గడిచింది.

మళ్ళీ అమ్మానాన్నలను బడికి పంపమని బతిమి లాడింది ఒకరోజు బడికి ఒకరోజు కూలిపనికి వెళ్ళడానికి ఒప్పుకున్నారు. ఎంతో సంతోషంగా ప్రవళిక అలా బడికి వెళ్ళడం మొదలుపెట్టింది.

బడిలో చకచకా ఒక సంవత్సరంలోనే అఆలు, గుణింతాలు, ఒత్తులు, పాఠాలు, లెక్కలు నేర్చుకుంది. బడిలో ఉపాధ్యాయులు ప్రవళిక తెలివి తేటలు చూసి 3వ తరగతిలో చేర్చారు.

అలా బడిలో చెప్పిన పాఠాలను వాళ్ళ అమ్మ

నాన్న,అన్న నిద్రపోయిన తర్వాత చదువుకునేది.

ఇలా 7వ తరగతిలోకి వచ్చింది. వాళ్ళ తరగతి ఉపాధ్యాయునికి ఒక సందేహం వచ్చింది.

ప్రవళిక ఒక రోజు వచ్చి ఒకరోజు ఎందుకు రావట్లేదో? ప్రవళికను పిలిచి అడుగుతాడు.

అప్పుడు ప్రవళిక "మా అమ్మ నాన్న బడికి వెళ్ళొద్దని అంటున్నారు. వాళ్ళని ఒప్పించి ఇలా ఒకరోజు బడికి, మరొక రోజు కూలిపనికి వెళ్తున్నానని" చెప్పింది.

ఆ మాటలు విన్న ఉపాధ్యాయునికి చాలా బాధ కలిగింది. ప్రవళికకు తెలియకుండా విషయం ఏమిటో తెలుసుకుందామని అనుకున్నాడు.

* * *

ప్రవళికకు తెలియకుండా వాళ్ళ ఇంటికి వెళతాడు. ఆ సమయంలో భద్రం ఒక వ్యక్తితో మాట్లాడుతూ ఉన్నాడు.

తాను వాళ్ళ ఊరి ప్రభుత్వ బడిలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయుడినని చెప్పి "మీ అమ్మాయిని బడికి ఎందుకు పంపించడం లేదు?" అని ప్రశ్నించారు.

అప్పుడు భద్రం ఆడపిల్లలు ఇంటి పనులకే అంకితం కావాలి. అదే అబ్బాయిలయితే మంచిగా చదువుకొని జాబ్ చేస్తారు. ఆడపిల్లకు చదువెందుకు? తేలిక భావంతో అంటాడు.

ఆ మాటలు విన్న ఉపాధ్యాయునికి ప్రవళికను ఎలాగైనా 10వ తరగతి పాస్ అయ్యేలా చేయాలని అనుకుంటాడు.

మరుసటి రోజు ప్రవళికను పిలిచి "నువ్వు రోజూ బడికి రా! నువ్వు కూలిపని చేసినట్లు నేను నీకు ఆ డబ్బులు ఇస్తాను. కానీ నువ్వు రోజూ క్రమం తప్పకుండా బడికి రావాలి" అన్నారు.

ఉపాధ్యాయుని మంచి మనసుకు దండం పెడుతూ "అలాగే సర్!" అంటుంది.

అలా రెండు సంవత్సరాలు గడిచాయి.

ప్రవళిక అన్న లక్ష్మణ్ ఇంట్లో గారాబంతో బడికి సరిగా పోకుండా, అటూ ఇటూ తిరుగుతూ చదువుకోక పోవడంతో 10వ తరగతిలో ఫెయిల్ అయ్యాడు.

ప్రవళిక మాత్రం రోజూ బడికి వెళ్ళి వచ్చేది. ఇంటికి రాగానే పనులన్నీ పూర్తి చేసేది. అందరూ పడుకున్నంక చదువుకునేది.

తాను, తమ ఉపాధ్యాయులు అనుకున్నట్లుగానే 10వ తరగతి మంచి మార్కులతో పాస్ అయ్యింది.

బడిలో ఉపాధ్యాయులు ప్రవళిక పేరును పేపర్లో వేయించారు.

అది చదివిన ఊర్లో వారందరూ భద్రం దగ్గరకు వెళ్ళి మీ అమ్మాయి 10వ తరగతి పాస్ అయినట్లు పేపర్లో పడింది. నువ్వు బడికే పంపలేదు కదా! ఇదెలా? అని ఆశ్చర్యంగా అడుగుతారు.

భద్రం వెంటనే ఇంటికి వచ్చి ప్రవళికను అడగుతుండగా వాళ్ళ బడి ఉపాధ్యాయులు వచ్చారు.

"ఆ రోజు మీ అమ్మాయిని బడికి పంపమని అడిగితే ఆడపిల్లలు ఇంటికే పరిమితం, పనులకు అంకితం కావాలని అన్నారు. కూలిపనికి పంపించారు. అమ్మాయిలను ఇంటికి అంకితం చేయకూడదు. మగపిల్లలతో సమానంగా చదువుకునే హక్కు వారికి ఉంది. అందులోనూ ప్రవళిక చాలా తెలివైన అమ్మాయి. అటు కూలి పనికి, ఇటు బడికి వస్తూ చదువుకుంటుంటే రోజూ బడికి వచ్చేలా చేశారు మా ఉపాధ్యాయుడు. ఇప్పుడు మన ఊరికే గర్వకారణంగా చక్కగా మంచి మార్కులతో పాస్ అయ్యింది. కాబట్టి మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలను బడికి పంపించాలి." ఆడపిల్ల చదువు అవనికి వెలుగు. ఈ అమ్మాయిని ఎలాంటి ఆటంకాలు లేకుండా చదివిస్తే మంచి ఉద్యోగం చేసి మీకు, మాకు మన ఊరికే గొప్ప పేరు తీసుకొని వస్తుంది." అన్నారు.

ఆ మాటలకు భద్రం, లక్ష్మి తమ తప్పు తెలుసుకున్నారు ప్రవళిక పట్టుదలతో చదువుకొని తాను అనుకున్నది సాధించింది. పెద్ద ఉద్యోగం సంపాదించింది.

నీతి:- ఆడపిల్లలను చదివిస్తే అనుకున్నది సాధిస్తారు.

- కొట్టె మేఘన
8వ తరగతి, జి.ప.ఉ.పా.పాపకొల్లు,
జూలూరుపాడు మండలం, భద్రాద్రి కొత్త గూడెం జిల్లా

# టాటూకి టాటా చెప్పేద్దాం!

"నానమ్మా, నానమ్మా..!"

"ఏంటి రామూ! ఏదో హడావిడిగా వస్తున్నావు?"

"ఏమి లేదు, నానమ్మా! నాకొక వంద రూపాయలు కావాలి."

"దేనికి రామూ!"

"ఈ రోజు ఆదివారం కదా! మా ఫ్రెండ్స్ అంతా టాటూ వేయించుకోవడానికి దగ్గర్లో ఉన్న టాటూ షాప్‌కు వెళతున్నారు."

"అవునా రామూ! నేనొక మాట చెబుతా వింటావా? టాటూల వల్ల చాలా నష్టాలుంటాయని విన్నాను."

"అదేంటి నానమ్మా! ఇప్పుడు టాటూ అనేది ఒక ట్రెండ్ కదా!"


"లేదు నాయనా! నాణ్యత లేని టాటూల వల్ల చాలా ఇబ్బందులు వస్తాయి. ముఖ్యంగా పలు రకాల చర్మ సమస్యలు వస్తాయని టీవీలో మొన్న ఓ డాక్టర్ గారు చెప్పడం చూశాను. పైగా టాటూ వేసుకోవాలంటే చాలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన చెప్పారు."

"అవునా.. నానమ్మా..."

"అవును, రామూ. వాటికి బదులు గోరింటాకు పెట్టుకో. దీని వల్ల నీకు ఏ ఇబ్బంది ఉండదు. పైగా గోరింటాకు వల్ల ఎంతో కొంత ఉపయోగం కూడా ఉంటుంది. ఖర్చు కూడా ఉండదు."

"అలాగే నానమ్మా" అంటూ తలూపాడు రామూ.

– యం. రాం ప్రదీప్
జెవివి సభ్యులు, తిరువూరు
9492712836



ఆట

# లండన్ బ్రిడ్జి



**ఎంత మంది పాల్గొనవచ్చు -**
**పది నుంచి పదిహేను మంది**

**ఎక్కడ ఆడవచ్చు -**
**ఆట మైదానంలో**

**ఈ ఆటకు గల ఇతర పేర్లు -**
**బొట్టుకు రెండు ద్రాక్ష పళ్ళు**

'లండన్ బ్రిడ్జి' ఆటలో బొమ్మలో చూపిన విధంగా పెద్ద పిల్లలు చేతులతో బ్రిడ్జి మాదిరి పెడితే, చిన్న పిల్లలు ఆ బ్రిడ్జి కింద నుండి వెళ్ళాలి. ఆటను ఎక్కువగా పల్లెటూళ్ళలో ఆడపిల్లలు పాఠశాలలో, ఇరుగు పొరుగు స్నేహితురాళ్ళతో ఇష్టంగా ఆడతారు.

ముందుగా పంటలు వేసి ఒక గ్రూపు నుంచి ఇద్దరు పిల్లలను ఎన్నుకోవాలి. ఆ ఇద్దరు పిల్లలు ఎదురెదురుగా నిలబడి చేతులను కలిపి బ్రిడ్జి (వంతెన) మాదిరి కట్టాలి.

మిగతా పిల్లలు ఆ వంతెన కింది నుంచి వలయాకారంలో తిరుగుతూ "ఒక బిందె నీళ్ళు పోస్తే ఒక పువ్వు పూసింది..." అంటూ పాడాలి. రెండో రౌండులో... "రెండు బిందెల నీళ్ళు పోస్తే రెండు పూలు పూసాయి..." అంటూ పాడాలి. అలా కొనసాగుతుంది.

పూవు పూసింది అన్నప్పుడు తిరుగుతున్న అమ్మాయిని బ్రిడ్జి మధ్యలో బంధించాలి. అలా బంధించబడ్డ అమ్మాయి బ్రిడ్జి కట్టిన ఇద్దరిలో ఒకరిని తప్పించి, వారి స్థానంలో నిలబడాలి. ఈ అమ్మాయి, వలయాకారంలో తిరుగుతున్న మిగతా పిల్లలతో కలిసి పోయి తిరగాలి.

ప్రయోజనం : ఈ ఆట ఆడటం ద్వారా పిల్లల మధ్య సమన్వయం, చురుకుతనం పెరుగుతాయి.


- 'చిన్ననాటి ఆటలు-జ్ఞాపకాల మూటలు' నుండి...

సీరియల్-7

# బంగారు ముర్రి

(బాలలకోసం ఆధునిక సాహస నవల)

(గత సంచిక తరువాయి...)



మృగరాజు సింహం అప్పుడే వేటాడి చెరువులో దాహం తీర్చుకుని తన గుహకు తిరిగి వెళుతున్నది. దారిలో దానికి కోతి కన్పించింది. "ప్రభూ! ఎక్కడికో వెళ్లి వస్తున్నారు?!" పలకరించింది కోతి. సింహం కోతి వైపు చూసి, చూడనట్టు ముందుకు కదిలింది. అది అలా నడుచుకుంటూ, నడుచు కుంటూ పోతూ ఉండగా దారిలో ఏనుగు కనిపించింది. "మృగరాజా! మీకోసం తియ్యటి చెరకు రసం సిద్ధంగా ఉంది. తాగి వెళ్ళండి!" అంది ఏనుగు. కానీ సింహం ఆగకుండా ముందుకు కదిలింది. ఏ జంతువు పలకరించినా తెలవని వాటిలా ప్రవర్తించింది.

దారిలో ఎలుగుబంటి, నక్క మృగరాజు కోసం ఎదురు చూశాయి. "మహారాజా! అడవిని కొత్తరోగం చుట్టు ముట్టింది. మీతో వెంటనే చర్చించాలి!" అంది ఎలుగుబంటి. "ఎవరు మీరు!" గర్జించింది సింహం. ఎలుగుబంటి, నక్క మృగరాజు ప్రవర్తనకు ఆశ్చర్యపోయాయి. ఇంతలో సింహం కడుపులో వికారం ఏర్పడింది. పెద్దగా అరుస్తూ వాంతి చేసుకుంది. కళ్ళు తిరిగి కింద పడిపోయింది. దాని నోటిలోంచి సన్నని ప్లాస్టిక్ సంచుల ముక్కలు బయటికొచ్చాయి. ఎలుగుబంటి వెంటనే సింహం నాడి పట్టుకుని పరీక్షించింది.

ఇంతలో ఆకాశంలో ఎగురుకుంటూ పోతున్న కొంగ కళ్లు తిరిగి కింద ఎలుగుబంటి ముందు పడింది. దాని నోటి నుంచి నురగ వచ్చింది. అందులో కూడా సన్నని ప్లాస్టిక్ సంచుల ముక్కలు కనిపించాయి. ఏనుగు కడుపు నొప్పితో రక్షించమని ఘీంకారం చేస్తూ అక్కడకు వచ్చింది. మూడింటిని పరీక్షించి పసరుమందు తాగించింది. సింహంకు తెలివి వచ్చింది. ఎలుగుబంటి మృగరాజుకు విషయం చెప్పి విశ్రాంతి తీసుకోమంది. ఇంతలో ఓ కోతుల గుంపు పెద్దగా అరుస్తూ చేతిలో పులిహోర పొట్లాలతో చెరువు వైపు పరిగెడుతూ కనిపించింది. ఎలుగుబంటికి విషయం అర్థమైంది. అది నక్కతో "ఈ దుష్టశక్తి ఎవరో కాదు. అదిగో ఆ కోతులే!" అంది. నక్కకు

అర్థం కాలేదు "కోతుల చేతిలోని పులిహోర పొట్లాలు!" అంది ఎలుగుబంటి. "అడవికి దగ్గరలో ఉన్న గ్రామంలోని గుడినుంచి ఈకోతులు అడవిలోకి తెస్తున్నాయి" అంది నక్క. "పులిహోర మంచిదే! ప్రసాదం. కానీ ఆ పులిహోర ప్లాస్టిక్ పొట్లాలలో నింపుతున్నారు. కోతులు వాటిని ఎత్తుకొచ్చి అడవిలో తిని ప్లాస్టిక్ పొట్లాలను చెరువువద్ద పడేస్తున్నాయి" అంది. ఇదంతా వింటున్న సింహం "ప్లాస్టిక్ వలన ఏమిటి నష్టం" అని అడిగింది. పడేసిన ప్లాస్టిక్ పొట్లాల వలన చెరువులోని నీరు కాలుష్యమైంది. ప్లాస్టిక్ మట్టిలోకి కొన్ని సంవత్సరాల వరకు విలీనం కాదు. కాడ్మియం, సీసం వంటి విషపూరిత ధాతువులు, ప్లాస్టిక్ సంచుల తయారీకి ఉపయోగిస్తారు. ఇది విషపదార్థం. దీనివలన వాంతులు, గుండె పెద్దది కావడం, మెదడు కణాలు క్షీణించి పోతాయి. ఇప్పుడు మీ ముగ్గురికీ కోతులు వదిలేసిన ప్లాస్టిక్ పొట్లాల కారణంగా అనారోగ్యం కలిగింది" అంది ఎలుగుబంటి. "పర్యావరణాన్ని పాడు చేసే ప్లాస్టిక్ అడవిలోకి రాకుండా చూడండి. కోతులకు ప్లాస్టిక్ పై అవగాహన కల్పించి ఇకపై అడవిలోకి ప్లాస్టిక్ తో వస్తే కఠినంగా శిక్షలు వేయండి" అన్నాడు మృగరాజు.


పులి అడవిలో లేక పోవటంతో పర్యావరణ సమతుల్యత దెబ్బ తిన్నదని గ్రహించిన మృగరాజు బంగారు మంత్రిని చేరుకుని తన మిత్రుడు పులిని అడవికి క్షేమంగా పంపమని మరో మారు కోరుకున్నాడు.

అంత చలిలోనూ ఖాదిర్‌కు చెమటలు పట్టాయి.

(సశేషం...)

– పైడిమఱ్ఱి రామకృష్ణ
m : 9247564699

## బొమ్మలేద్దామా...




బి. చాహ్నకృష్ణ, 8వ తరగతి, 12 సంవత్సరాలు, జెనీవా

శతకం


## వేమన పద్యాలు

నీళ్ళలోన మొసలి నిగిడి యేనుగు బట్టు
బైట కుక్కచేత భంగపడును
స్థాన బల్మిగాని తన బల్మిగాదయా
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యం : మొసలి నీటిలో ఉన్నప్పుడు ఏనుగునైనను పట్టుకొనగలుగును. బైట కుక్కను గూడ యేమియు చేయలేక లొంగిపోవును.

మృగమదంబు జూడ మీద నల్లగనుండు
బరిఢవిల్లు దాని పరిమళంబు
గురువులైన వారి గుణములీలా గురా!
విశ్వదాభిరామ వినురవేమ!

తాత్పర్యం : కస్తూరి చూచుటకు నల్లగా ఉండును. కాని దాని సువాసన విశేషమైన గొప్పదిగా ఉండును. గురువులైన వారిలో మంచి గుణములు గూడ ఆ విధముగానే చాలా గొప్పవిగా ఉండును.



కథ

# మొక్కల ఎంపిక




శాలినీ రాజ్యాన్ని ఏలే కీర్తిసేనునికి చెట్లంటే ప్రాణం. చెట్ల వల్లనే సకాలంలో వర్షాలు పడడమే కాకుండా రాజ్యంలో కరువు కాటకాలు ఉండవని, వాటి వల్ల కాలుష్యాన్ని కూడా అరికట్టవచ్చని ఆయన అభిప్రాయం. అందువల్ల ప్రతి సంవత్సరం ఆయన ప్రజల చేత తన రాజ్యంలో విరివిగా మొక్కలను నాటింపజేసేవాడు.

ఒక సంవత్సరం ఆయన ప్రజలందరూ మొక్కలు నాటాలని చాటింపు వేయించాడు. ప్రజలు మంచి మొక్కలను ఎంపిక చేసుకొనడానికి వారి మధ్యన పోటీ ఉంటుందని ఆ ప్రకటనలో తెలిపాడు. అంతేకాదు. ఎవరైతే మంచి మొక్కలను నాటడానికి ఎన్నిక చేసుకుంటారో వారికి బహుమతి కూడా ఉంటుందని ప్రకటించాడు.

ఆ రాజ్యంలో చాలామంది ప్రజలు మొక్కలు నాటడానికి ఆసక్తిని కనబరిచారు. వారు తమకు ఇష్టమైన మొక్కలను ఎంపిక చేసుకొనడానికి రాజాస్థానానికి వచ్చారు. రాజు వారితో "ప్రజలారా! ఇక్కడ మీరు నాటడానికి వివిధ రకాలైన మొక్కలు ఉన్నాయి. మీరు ఎవరైతే మంచి మొక్కలను ఎంపిక చేసుకుంటారో వారికి బహుమతినీయడం జరుగుతుంది" అని ప్రకటించాడు. కొందరు ప్రజలు మామిడి, అరటి వంటి పండ్ల మొక్కలను తీసుకున్నారు. మరికొందరు చింత, కొబ్బరి వంటి మొక్కలను తీసుకున్నారు. ఇంకా కొందరు గులాబీ, చేమంతి, మల్లె మొక్కలను ఏరుకున్నారు. ఇలా ఎవరికి నచ్చిన మొక్కలను వారు తీసుకున్నారు. కానీ అక్కడికి వచ్చిన రామయ్య మాత్రం మర్రి, కానుగ చెట్ల మొక్కలను ఎంపిక చేసుకున్నాడు.

ఇది గమనించిన రాజు "ఓ రామయ్యా! అందరూ పండ్ల మొక్కలు, పూల మొక్కలు, తమకు లాభసాటి వ్యాపారాన్ని చేకూర్చే చింత, కొబ్బరి మొక్కలను తీసుకుంటే నీవేమిటి? ఇలా నీకు ఏమి లాభం చేకూర్చని మర్రి, కానుగ మొక్కలను తీసుకున్నావు?" అని ప్రశ్నించాడు.

అప్పుడు రామయ్య "మహారాజా! నేను నాకోసం ఈ మొక్కల్ని ఎంపిక చేసుకోలేదు. చాలా మంది బాటసారులు వేసవికాలంలో చెట్ల నీడ లేక దారిలో నడవలేక విశ్రాంతి తీసుకోలేక అవస్థ పడుతున్నారు. అందువల్ల ఆ బాటసారుల కొరకే నేను ఈ మొక్కలను ఎంపిక చేసుకున్నాను. ఇవి పెరిగి పెద్ద వృక్షాలు అయితే వారికి మంచినీడతో పాటు పరిశుభ్రమైన గాలి కూడా దొరుకుతుంది. ఇవి కాలుష్యాన్ని కూడా అరికట్టి అన్నీ జీవులను కాపాడుతాయి. ఈ చెట్లు బాటసారుల అలసటను కూడా పోగొడతాయి. అంతేకాదు పక్షులకు కూడా ఇవి ఆశ్రయమిస్తాయి. అదే నాకు ఆనందం" అని అన్నాడు.

అప్పుడు మహారాజు "చూశారా ప్రజలారా! మీరంతా మీ మీ స్వార్థంతో మీ స్వలాభం కోరి మీ ఇష్టం వచ్చిన పండ్ల మొక్కలను, పూల మొక్కలను, వ్యాపార మొక్కలను ఎంపిక చేసుకున్నారు. కానీ ఈ రామయ్య మాత్రం ఇతరుల కొరకు మాత్రమే తన మొక్కలను ఎంపిక చేసుకున్నాడు. అందువల్ల ఈసారి బహుమతిని స్వార్థం లేని ఈ రామయ్యకే ప్రకటిస్తున్నాను. అంతేకాదు. అతనికి తగిన సత్కారం కూడా చేస్తాను" అని ప్రకటించగానే సభలో కరతాళ ధ్వనులు మారుమ్రోగాయి.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య
ధర్మపురి
m: 9908554535

# అక్షరాల జాడ - పదాల క్రీడ

## జంట పదాల ధ్వనులు

ఒంటరిగా గుర్తింపు లేని పదానికి అదే పదం జత కలిస్తే అది అర్థవంతమైన జంట పదం, అవి ధ్వనులను పరిచయం చేస్తాయి.

కాగే నీరు – సల సల
పారే నీరు – గల గల
ఉడికే అన్నం – కుత కుత
పొంగే పాలు – బుస బుస
ఒక నవ్వు – పక పక
మరో నవ్వు – కిల కిల
వాగుడు కాయ – లొడ లొడ
బొంగురు గొంతు – గర గర

దీపాల తోరణాలు – ధగ ధగ
ఆప లేని ఏడుపు – వల వల
నములుతారు – కర కర
చింపుతారు – పర పర
పాము పాకును – జర జర
మండే నిప్పులు – కణ కణ
అరిచే కప్పులు – బెక బెక
మండే సూర్యుడు – భగ భగ



– డా. చొక్కాపు వెంకటరమణ
అక్షరాలతో ఆటలు
TANA telugu tejam Kishora Vibhagam-1
m : 92465 20050

# బాలచెలిమి దేవరకొండ గ్రంథాలయాన్ని సందర్శించిన లయన్ సముద్రాల ధనుంజయ




నల్గొండ జిల్లా దేవరకొండ మండలంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో బాలచెలిమి సంస్థ ఏర్పాటు చేసిన బాలచెలిమి గ్రంథాలయాన్ని లయన్ సభ్యులు శ్రీ సముద్రాల ధనుంజయ గారు సందర్శించారు. విద్యార్థులు పుస్తకాలు చదువుతున్న తీరు, వారి ఆసక్తి, పఠనంపై పెరుగుతున్న చైతన్యాన్ని ఆయన స్వయంగా పరిశీలించి, బాలచెలిమి నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ధనుంజయ గారు మాట్లాడుతూ, “గ్రంథాలయం అనేది విద్యార్థుల్లో చదువుపట్ల ఆసక్తి పెంచే వెలుగు దీపం. బాలచెలిమి దేవరకొండ శాఖను ఏర్పాటు చేసిన బాలచెలిమి సంపాదకులు శ్రీ మణికొండ వేదకుమార్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ మినీ గ్రంథాలయం గ్రామీణ బాలలకు గొప్ప ప్రేరణ. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదం చేస్తాయి” అని తెలిపారు. విద్యార్థుల్లో మరింత ఉత్తేజం నింపేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఆయన ధన్యవాదాలు తెలిపారు.







కోటలింగాలలో దొరికిన లిపిగల నాణేలు, నొక్కుడు గుర్తులు గల నాణేలు


## తెలంగాణ చారిత్రక పర్యాటకం

# కోట లింగాల

క్రీస్తు పూర్వం 6వ శతాబ్దం నుండి క్రీ.శ. 4వ శతాబ్దం వరకు తొలి చారిత్రక యుగంలో తెలుగు నేల కొత్త పుంతలు తొక్కింది. దక్షిణాదిన గోదావరి తీరంలోని ఒకే ఒక అస్మక మహాజన పదానికి బోధన్ రాజధానిగా ఉండేది. మౌర్యవంశం మన భారతదేశంలో మహోన్నత మగధ సామ్రాజ్యాన్ని స్థాపించింది. క్రీస్తు పూర్వం 4-3 శతాబ్దాలలో తెలుగు నేల మౌర్యుల పాలనలో ఉండేది. వీరి తర్వాత శాతవాహన సామ్రాజ్యం వెలిసింది. మూడు శతాబ్దాల పాటు అప్రతిహాసంగా ఫరిడవిల్లిన ఈ సామ్రాజ్యానికి మరో వందేళ్ళ కిందటే పునాదులు మన తెలంగాణలోని కోటలింగాలలో పడ్డాయి. శాతవాహనులకు ముందు అంటే క్రీ.పూ. 3వ శతాబ్దం నుండి క్రీ.శ. 1వ శతాబ్దం వరకు తెలంగాణ నేలిన రాజులెవరు? ఏ పురావస్తు ఆధారాలు వారి ఉనికిని తెలుపుతాయి? వారు ఎక్కడ నుంచి పాలించారు? అనే ప్రశ్నలకు కోటలింగాలలోని భూమి పొరలు గత చరిత్రకు సాక్ష్యాలనిస్తున్నాయి. నేటి జగిత్యాల జిల్లా కేంద్రానికి 36 కి.మీ. ధర్మపురి నుండి 19 కి.మీ. వెల్గటూరు మండల కేంద్రానికి 4.5 కి.మీ. దూరంలో గోదావరి నదీ తీరాన్ని అనుకొని పెద్దవాగు కలిసే ప్రదేశమే కోటలింగాల అనే గ్రామము. మౌర్యుల పతానానంతరం చిన్న చిన్న పాలకులు ఆయా ప్రాంతాలలో స్వాతంత్ర్యం ప్రకటించుకొని పాలించారని చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి. అస్మక జనపదంలో ఉన్న ఈ కోట గోడల నగరం మెగస్తనీసు ఇండికాలో 30 కోట గోడల నగరాల్లో కోటలింగాల, కొండాపూర్, ధాన్యకటకం, ధూళికోటలను పేర్కొన్నారు. ఇక్కడి మట్టిగోడ సుమారు 1000 మీ. పొడవు 300 మీ. వెడల్పు, 10 మీ. ఎత్తుంది. ఇందులో 3 భాగాలు గ్రామం విస్తరించగా 1 భాగం పొలాలున్నాయి. అయితే ఇంత ప్రాముఖ్యత గల శాతవాహనుల మూలాలను గురించి వారి తొలి పాలకుల గురించిన చరిత్ర 1978 వరకు నిగూఢంగా ఉండిపోయింది. ఈ ఊరిలో పోస్టుమాస్టర్‌గా పని చేసిన సంగనభట్ల నరహరికి ఈ గ్రామంలో దొరికిన కొన్ని నాణేలను ప్రఖ్యాత ఎఫిగ్రఫిస్ట్ పి.వి. సుబ్రహ్మణ్యశాస్త్రికి చూపించారు. ఆ నాణాలే ఒక మహా సామ్రాజ్య స్థాపకుడి పేరును, ఆ రాజ్య స్థాపన జరిగిన ప్రాంతాన్ని వెల్లడించి చరిత్రలోని పెద్ద శూన్యాన్ని నింపడమే కాకుండా ఎన్నో రహస్యాలను బహిర్గతం చేశాయి. ఈ గ్రామంలో సుమారు 100 ఎకరాల స్థలంలో శాతవాహనులు ముందుగా ఈ ప్రాంతాన్ని పాలించిన (స్వతంత్ర) గణతంత్ర రాజులైన గోబద, నరన, సిరవయస, సమగోప, కంవాయస తరువాత శాతవాహన వంశ మూల పురుషుడైన చిముకుడు లేక చిముక శాతవాహనుడు స్వతంత్రుడై శాతవాహన రాజ్యాన్ని స్థాపించి పరిపాలించాడని 1979 - 80 నుంచి 1983 - 84 వరకు జరిగిన త్రవ్వకాలలో పి.వి. పరబ్రహ్మశాస్త్రి, డా. రాజారెడ్డి, వీ.వీ. క్రిష్ణశాస్త్రి, ఠాకూర్ రాజారాంసింగ్, బి.యన్. శాస్త్రి, డా. యన్.యస్. రామచంద్రమూర్తి తదితర పరిశోధకులు పేర్కొన్నారు. ఇక్కడి స్థానిక రాజుల నాణేలు శాతవాహన పొరల కంటే కింది పొరలలో లభించినవి. తర్వాత శాతవాహనులు మొదటగా కోటిలింగాల, పిదప పైఠాను (మహారాష్ట్ర) తరువాత కొండాపూర్ చివరగా ధాన్యకటకం (నేటి అమరావతి) నుంచి పాలించారు. వీళ్ళలో గౌతమీ పుత్ర శాతకర్ణి (క్రీ.శ. 60-90) ఇప్పటి భారతదేశంలో మూడొంతులకు పైగా పాలించాడు. ఈ కోటలో జరిపిన త్రవ్వకాల్లో 2.25 మీ. వ్యాసంతో 30 × 20 × 60 సెం.మీ. ఇటుకలతో కట్టిన క్రీ.పూ. 3-2 శతాబ్దాల నాటి ఉద్దేశిక బౌద్ధ స్థూపం బయటపడింది. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముంపుకు గురౌతున్న ఈ చారిత్రక స్థలాన్ని డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ఛైర్మన్ శ్రీ మణికొండ వేదకుమార్ గారి ఆధ్వర్యంలో, ప్రముఖ చరిత్రకారులు, పరిశోధకుల బృందం పలుమార్లు సందర్శించి కోటలింగాలను ప్రభుత్వం దృష్టికి తేవడంతో పురావస్తు శాఖ 2008 - 2012 సంవత్సరం మధ్య కాలం త్రవ్వకాల్లో లిపి శాసనాలు, సున్నపురాతి శిలాఫలకాల స్థూపం, బుద్ధపాల శిల్పాలు, చైత్యం, నలుపు, ఎరుపు పాత్రలు, మట్టిగాజు, స్పటికం పూసలు, ఇనుప పనిముట్లు, సుమారు 447 నాణేలు సీసం, రాగి, ప్రోటీను, ఇత్తడి, వెండి, బంగారు నాణేలు లభించాయి. ఈ కోటలో ఒక బురుజుపైన లింగాన్ని ప్రతిష్ఠించి కోటేశ్వరస్వామి అని పిలవటాన ఈ గ్రామాన్ని నేడు కోటిలింగాలుగా పిలుస్తున్నారు. శాతవాహనులు బౌద్ధంతో పాటు అశ్వమేధాధి యజ్ఞాలు చేసి వైదిక మతాలను ఆదరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ఇక్కడ ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ పర్యాటకులకు బోటింగ్ వసతి కల్పించారు. ఇక్కడ కోటలింగాల గొప్పదనాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన డా. రాజారెడ్డి గారి సూచనలతో మరిన్ని తవ్వకాలు చేపట్టి, ముఖ్యంగా నాణేలతో, నాటి నుండి నేటి పరిణామ క్రమాన్ని తెలిపే మ్యూజియం, పర్యాటక వసతులు కల్పిస్తే గత చరిత్ర భావితరాలకు తెలుస్తుంది.

- దేశరాజు శ్యాంసుందర్‌రావు - స్థపతి
m : 9010051177

# అగ్నికి వాయువు శత్రువా?




నిప్పుకి గాలి స్నేహితుడు అని లోకంలో వాడుక. కాని అది నిజం కాదనిపించే గమత్తు ఒకటి ఉంది. దీనిని చేయడానికి బేకింగ్ సోడా (సోడియం బై కార్బనేట్), వినెగర్ (ఎసిటిక్ ఏసిడ్), గ్లాసు, కొవ్వొత్తి, అగ్గిపెట్టి, దళసరి కాగితం కావాలి. దళసరి కాగితాన్ని మడత పెట్టి, కాలువ లాగా తయారుచేసి, వెలిగించిన కొవ్వొత్తికి దగ్గరలో బొమ్మలో చూపించినట్లు పట్టుకో. ఒక గ్లాసులో అరకప్పు వినెగర్ పొయ్యి. అందులో ఒక చమ్చాడు బేకింగ్ సోడా వెయ్యి. గ్లాసులో నుంచి బుడగలు వస్తూ ఉంటాయి; చటుక్కున గ్లాసుమీద మూత పెట్టు. కొద్ది సెకనులు అలా ఉంచి, మూత తీసి, గ్లాసును కాస్తవంచి, కాగితపు కాలువ మీద బొమ్మలో చూపించినట్లు పట్టుకో. గ్లాసులోని కనిపించని గాలి కాలవగుండా కిందికి ప్రవహించి, కొవ్వొత్తిని ఆర్పేస్తుంది!

అగ్ని సఖుడైన వాయువుకి ఈ శత్రుత్వం ఏమిటో? మంటని ఆర్పిన ఈ వాయుదేవుడు, లేదా వాయు రాక్షసుడు ఎవరు? ఆ వాయువు పేరు కార్బన్ డై ఆక్సైడ్. ఇది మామూలుగా మనం పీల్చే గాలి కన్నా చాలా బరువు కాబట్టి కాగితం కాలవగుండా కిందికి ప్రవహించి, కొవ్వొత్తిని చేరుకుని, మంటని ఆర్పేసింది.

అవునుగానీ, ఈ వాయువు వల్ల మంట ఎందుకు ఆరిపోయిందో తెలుసా? మంట మండటానికి ఆక్సిజన్ కావాలి. బరువైన కార్బన్ డై ఆక్సైడు తేలికైన ఆక్సిజన్ వాయువును గెంటేసి, తాను మంటచుట్టూ అలుముకోవడం వల్ల, ఆక్సిజన్ దొరకక మంట ఆరిపోయింది. సరిగ్గా ఇదే సూత్రాన్ని ఉపయోగించి మండుతున్న ఇళ్లను ఆర్పవచ్చు. కానీ, ఒక ఇబ్బంది ఉంది. ఈ వాయువు బరువైనది కావడం వల్ల నేల మీదనే ఆవరించుకుని, కిందనున్న మంటలనే ఆర్పుతుంది కానీ, ఎత్తైన భవనాలు మండుతూ ఉంటే అర్పడానికి ఈ గాలి ఉపయోగించదు.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

'ప్రతి ఇంటా ప్రయోగశాల' నుండి


## సామెతలు

- అందరినీ మెప్పించడం అలవిగాని పని.
- ఆముదపు విత్తులు ఆణిముత్యాలగునా?
- ఇల్లు కాలుతుంటే బావి తవ్వించినట్లు.
- ఉల్లి మల్లి కాదు, కాకి కోకిల కాదు.
- ఊసరవెల్లి వలే రంగులు మార్చేవాడు.
- ఎండిన ఊళ్ల గోడు ఎవడికి కావాలి, పండిన ఊళ్ళకి అందరూ ప్రభువులే.
- ఒంటి కంటి జంట మేలు.

– బాలచెలిమి

లఘు నాటిక

# అతిథి దేవో భవ




పాత్రలు: మధుసూదన్, భవాని (తండ్రి, తల్లి)
రాఘవ, కీర్తన (కొడుకు, కూతురు)
సాగర్, శారద (స్నేహితుడు, అతని భార్య)
రవి, రషిత (సాగర్ పిల్లలు)

## దృశ్యం - 1

రాఘవ: మాతృ దేవోభవ
పితృ దేవో భవ
ఆచార్య దేవోభవ
అతిథి దేవోభవ
(పుస్తకంలో చూసి చదువుతుంటాడు)

కీర్తన: (నోటు పుస్తకంలో రాసుకుంటుంది)
(కాలింగ్ బెల్ చప్పుడు)... అన్నయ్య ఎవరో వచ్చారు చూడు నేను రాసుకుంటున్నాను.

సాగర్: (బయట నుంచి) మధు... మధు... హరహర... తలుపు తీయండయ్యా?

రాఘవ: (విసుగ్గా పుస్తకం పక్కన పెట్టి తలుపు తీస్తాడు) ఎవరు మీరు?

సాగర్: (లోపలికి వచ్చి) హర హర మధు మా మధు ఎక్కడ మా మధు ఎక్కడ? (అటు ఇటు చూస్తుంటాడు)

రాఘవ: ఎవరు అంకుల్ మీరు మా నాన్నని మధు మధు అని పిలుస్తున్నారు?

సాగర్: ఏంటి ఏంటి బాబు నువ్వు మా మధు కొడుకువా? (దగ్గరికి తీసుకొని కౌగిలించుకొని ముద్దు పెడుతుంటే చిరాగ్గా చూస్తాడు రాఘవ) హరహర ఏది ఇలా రా...

రాఘవ: ఏంటి మీరు దూరం జరగండి అసలు మీరు ఎవరు? ఎందుకు వచ్చారు?

సాగర్: హహహ (నవ్వి) నేనెవరో నీకు తెలియదు కదూ హరహర ఇప్పుడు అర్థమైంది సరే చెబుతాను. నేను మీ నాన్న ఫ్రెండుని. నా పేరు సాగర్. మీ నాన్న నేను ఎంతో క్లోజ్ ఫ్రెండ్స్ నీకు తెలుసా?

రాఘవ: అవునా సరేగాని (పెడసరంగా) మా నాన్న ఇంట్లో లేరు నేను చదువుకోవాలి మీరు బయలుదేరుతారా!

సాగర్: నేను... నేను... మీ నాన్న..

రాఘవ: చెప్పాను కదా అంకుల్. మా నాన్న అమ్మ బయటకు వెళ్లారు. సాయంత్రానికి వస్తారు మీరు ఇక వెళ్లొచ్చు.

సాగర్: ఏంటి వీడు మా మధు పిల్లాడేనా హరహర ఏంటో ఈ కాలం పిల్లలు అంటూ వెళ్ళిపోతాడు.
(అతని ముందుకు నడిపి తలుపు వేస్తాడు)

కీర్తన: అదేంటి అన్నయ్య అలా పంపించేసావు ఎవరో ఫ్రెండ్ అంటున్నాడుగా.

రాఘవ: అబ్బా ఇప్పుడు ఆయనని కూర్చోబెట్టాలా! మన పనులు మనకు ఉన్నాయి. ముందు చదువు. ఒక్క మార్కు తక్కువ వచ్చిన అమ్మ నాన్నా ఇద్దరు మన ప్రాణాలు తీసేస్తారు. (రాఘవ పుస్తకం తీసుకొని అటు ఇటు తిరుగుతూ చదువుతుంటాడు)

## దృశ్యం -2

**(భవాని మధుసూదన్ చేతిలో బ్యాగులతో ఇంటి లోపలికి వస్తారు)**

భవాని: అబ్బా చాలా అలసిపోయాం కదండీ..

మ.సూ.: అవును భవాని కాస్త ఫ్రెష్ అయ్యి మంచి టీ పెట్టుకురా

భవాని: అలాగే. కీర్తనా! కీర్తన ఏం చేస్తున్నావ్ (అంటూ లోపలికి వెళుతుంది).

మ.సూ.: రాఘవా!... నిన్నే రాఘవ...

కీర్తన, రాఘవ: (ఇద్దరు వస్తారు) ఆ నాన్న వచ్చేసారా.

మ.సూ.: మీరేంటి రూమ్‌లో చదవకుండా పడుకున్నారా?

కీర్తన: ఏం లేదు నాన్న.

రాఘవ: అదే... ఏం లేదు నాన్న మీరు చెప్పిన చాప్టర్ చదివేసా!

కీర్తన: నాన్నా అన్నట్టు మీకోసం ఎవరో వచ్చారు.

మ.సూ.: నా కోసమా ఎవరు?

రాఘవ: అదే హరహర అంకుల్.

మ.సూ.: హర హర అంకుల్ ఏంట్రా ఎవర్రా?

రాఘవ: అదే నాన్నా... మాట మాటకి హర హర అంటాడు. మీ ఫ్రెండట.

మ.సూ.: ఏమిటి కొంప తీసి నా ఫ్రెండ్ సాగర్ కాదు కదా!

రాఘవ: ఏమో నాన్న అనుకుంటా అలాగే నిలబడ్డాడు నేనే మా నాన్న లేడు సాయంత్రం వస్తాడు వెళ్ళమని చెప్పా.

మ.సూ.: ఏంటి మా నాన్న లేడు వెళ్ళమన్నావా? కనీసం కూర్చోమనలేదా?

కీర్తన: లేదు నాన్న. అంకుల్ మీరిక వెళ్ళండి అని కూడా అన్నాడు.

మ.సూ.: ఏంట్రా ఏంటి నువ్వు చేసిన పని. ఇంటికి వచ్చిన మనిషితో అలాగేనా మాట్లాడేది?

భవాని: (లోపలి నుంచి వస్తుంది) ఏంటండీ ఏం జరిగింది?

మ.సూ.: భవానీ.. వీడు నా ఫ్రెండ్ ఇంటికి వస్తే మా నాన్న లేడు మీరిక వెళ్ళండి అని పంపించేసాడట!

భవాని: అవునా! ఎవరు వచ్చారు?

మ.సూ.: మా సాగర్.

భవాని: ఏంటి సాగర్ అన్నయ్య వచ్చాడా?

మ.సూ.: మరే.. వీడు మా నాన్న లేడు సాయంత్రం వస్తాడు మీరు ఇక వెళ్ళండి అన్నాడట.

భవాని: అయ్యో అయ్యో వీడికి అసలు తెలియదు పాపం సాగర్ అన్నయ్య ఏమనుకున్నాడో అయినా ఇవాళ రేపు వీళ్ళు ఇంత చదువులు చదువుతున్నారు అన్ని డబ్బులు పోసి మనం చదివిస్తున్నాము కదా! ఇంటికి వచ్చిన మనిషితో ఎలా మాట్లాడాలో బడిలో చెప్పరేంటండి?

మ.సూ.: ముందు మనం చెప్తున్నామా? బడిలో మాత్రం ఎందుకు చెప్తారు. నాలాంటి వారు అస్తమానం నీకు మార్కులు ఎందుకు తక్కువ వచ్చాయని పిల్లలను విసిగిస్తాం. వీరికి పరీక్షలు ఎప్పుడు పెడుతున్నారు అని బడి వారిని అడుగుతూనే ఉంటాం.. వాళ్ళు మాత్రం ఏం చేస్తారు? అయినా ఇప్పుడు నాకు అర్థం అవుతుంది. పిల్లలకు ఇంటికి వచ్చిన వారిని ఎలా రిసీవ్ చేసుకోవాలో చెప్పాలి.

భవాని: చెబితే ఏం లాభం లేదు. మన కాలంలో మనుషులకు ఒకరి పట్ల ఒకరికి ఉండే ప్రేమలు అభిమానాలు వీరికి చూపించాల్సిందే.

మ.సూ.: ఏం చేద్దాం ఐడియా...(భార్యకి చెవిలో చెప్తాడు అలా ఇలా అంటూ భవాని ఓకే అని ఇద్దరు తలలు ఊపుతారు)

మ.సూ.: (ఫోన్ తీసుకొని నెంబర్ డయల్ చేస్తాడు) హలో... ఒరేయ్ సాగర్ నేనేరా నేను కొంచెం దూరం వెళ్లాను అక్కడ సిగ్నల్స్ లేవు వచ్చి వెళ్ళావని మా అబ్బాయి రాఘవ చెప్పాడు. చూడు వాడి తరఫున నేను సారి చెప్తున్నా...నిన్ను కనీసం లోపలికి కూడా రానివ్వలేదట.. పర్వాలేదా.. అలా అంటావేంట్రా? అది కాదు కానీ నాదొక మాట విను. ఎల్లుండి నేను మా పిల్లల్ని తీసుకొని నీ దగ్గరికి వస్తున్నా సరేనా (ఫోన్ పెట్టేస్తాడు అటు ఇటు తిరుగుతుంటాడు)

## దృశ్యం - 3 (సాగర్ వారింట్లో)

(మొదటి దృశ్యంలో రాఘవ కీర్తనల లాగే రవి, రషిత కూర్చొని చదువుతుంటారు)

(కాలింగ్ బెల్ చప్పుడు)

మ.సూ.: ఎవరు లోపల తలుపు తీయండి సాగర్ సాగర్..

రషిత: అన్నయ్య చూడు ఎవరో వచ్చినట్లున్నారు. తలుపు తీయి.

రవి: (తలుపు తీస్తాడు) లోపలికి రండి అంకుల్ మీరు..

మ.సూ.: నేను మధుసూదన్‌ని సాగర్ లేడా?

రవి: అంకుల్ నమస్తే (తొంగి చూసి భవానితో) ఆంటీ నమస్తే రండి రండి లోపలికి రండి (పిల్లలతో).

రషిత: (అందర్నీ చూసి పలకరిస్తూ) నమస్కారం అంకుల్ నమస్తే అంటి కూర్చుండి.నాన్న లోపల ఉన్నారు పిలుస్తాను.(అందర్నీ కూర్చోబెడతారు).

రవి: (లోపలికి చూస్తూ)నాన్నా నాన్న మీకోసం అంకుల్ ఆంటీ వాళ్ళు వచ్చారు. అమ్మా వస్తున్నావా..

శారద: అన్నయ్యా వచ్చారా? ఎన్నాళ్లయింది మిమ్మల్ని చూసి.. వదినా బాగున్నావా? (అని చేయి కలుపుతుంది) పిల్లలు బాగున్నారా? (అని పలకరిస్తుంది)

సాగర్: హరహర వచ్చారా మై ఫ్రెండ్ (అంటూ కౌగిలించుకుంటాడు) చెల్లెమ్మ అంతా క్షేమమే కదా! (రాఘవ దగ్గరికి వెళ్లి)ఒరేయ్ నీ కొడుకేగా చూసాను. మొన్న హరహర..

రాఘవ: (సిగ్గుతో తలదించుకుంటాడు)

సాగర్: ఏం చదువుతున్నావ్ నాన్న.

రాఘవ: ఎనిమిదో తరగతి.

సాగర్: (కీర్తనతో) నీ పేరు.. నువ్వేం చదువుతున్నావ్?

కీర్తన: నా పేరు కీర్తన నేను ఆరో తరగతి.

(రషిత మంచి నీళ్లు తెచ్చి అందరికీ అందిస్తుంది)

మ.సూ.: ఎన్నాళ్ళు అయింది రా మనం కలిసి, మీ ఊరు వెళ్ళితే మీ అమ్మగారు నన్ను కూర్చొబెట్టి కొసరి కొసరి వడ్డించి ఎంత ప్రేమగా చూసుకునేదని అసలు ఆ రోజులే వేరు రా..

భవాని: అవునన్నయ్య నాతో చెప్పేవారు. ఇంటికి వచ్చేస్తుంటే బ్యాగు తీసి దాచిపెట్టి ఇంకొన్నాళ్ళు ఉండమని అడిగేవారట ఆ అభిమానాలన్నీ రాను రాను అంతరించిపోతున్నాయి

శారద: రండి అందరూ భోంచేస్తూ మాట్లాడుకుందాం

(భోజనం సీను చూపకుండా తెరవెనుక నుంచి శారదా సాగర్ మాటలు వినిపించాలి)

శారద: అన్నయ్య ఇది బాగుంటుంది ఇది కొంచెం వేసుకోండి.

సాగర్: శారద నువ్వు చెల్లెమ్మకు వడ్డించు తను అలాగే మొహమాట పడుతుంది పెట్టు ఇంకొంచెం పెట్టు.

శారద: నాన్నా రాఘవ కడుపునిండా తిను.

సాగర్: అమ్మ కీర్తన అలా పొడి పొడిగా తింటున్నావ్.. ఇంకొంచెం పెట్టుకో సరిగ్గా తిను.. (బయటకు వస్తుండగా)

రషిత: అంకుల్ నాప్కిన్ (అందరికీ ఇస్తుంది).

మ.సూ.: అబ్బ కడుపు నిండిపోయింది రా చెల్లెమ్మ చేతి వంటే వంట!

భవాని: అది మాత్రమే కాదండోయ్ వదిన ఎంతో అభిమానంగా వడ్డించారు చూడండి అది అందులో ఉంది గొప్పతనం.

రాఘవ: (వచ్చి కూర్చున్నా డల్‌గా ఉంటాడు).

మ.సూ.: ఏరా రాఘవ ఏంటి అలా ఉన్నావ్?

సాగర్: హర హర ఏ నాన్నా వంటలు నచ్చలేదా? కడుపు నిండ లేదా? ఏమోయ్ రాఘవకి స్వీట్ తీసుకురా!

రాఘవ: (వెంటనే లేచి సాగర్ రెండు చేతులు పట్టుకుంటాడు) అంకుల్ ఐ యాం సారీ వెరీ వెరీ సారీ.

సాగర్: అదేంటి నాన్న ఏమైంది? రాఘవ మీరు మా ఇంటికి వస్తే నేను ముఖం మీద తలుపేసి మీరు వెళ్ళండి అని అన్నాను. నాకు చాలా గిల్టీగా ఉంది ఇంత అభిమానం చూపే మిమ్మల్ని కనీసం లోపలికి పిలిచి గ్లాస్ మంచి నీళ్లు కూడా ఇవ్వలేదు.

సాగర్: హరహర అదేం కాదురా అబ్బాయి. నీ తప్పేమీ లేదు. నేటి రోజుల్లో ఎదురింటిలో ఎవరున్నారో మనకు తెలియదు. మన ఇంటికి ఎవరు వచ్చినా మనకి టైం ఉండటం లేదు అంతా ఎవరికి ఎవరూ అనే యాంత్రికమైన జీవితాలు గడుపుతున్నాం.

శారద: పైగా తలుపు కొడితే లోపలికి రానిస్తే అసలు వారు మంచి వారో.. దొంగలో తెలియని మోసపూరిత వాతావరణంలో మనం బ్రతుకుతున్నాం. నీవు తెలియక చేసావు.

మ.సూ.: అందుకే నేను ఈరోజు పనిమాలా ఇక్కడికి తీసుకొచ్చాను. మర్యాదలు ప్రేమలు తెలియాలని

భవాని: ఇంటికి వచ్చిన అతిథి ని ఎలా చూసుకోవాలంటే దైవంతో సమానంగా భావించి చూసుకోవాలని అర్థమైందా.

మ.సూ.: చదవడం మాత్రమే కాదు నాన్నా.. దాన్ని ఆచరణలో చూపాలి సరేనా...

కీర్తన, రాఘవ: అర్థమైంది నాన్నా అతిథి దేవో భవ (అందరూ సరదాగా ఒకరి భుజాలపై ఒకరు చేతులు వేసుకుని నిలబడతారు)

* * *

– డా. సమ్మెట విజయ

m: 99898 20215

# ఎఫ్.ఎం. రేడియో ఆవిష్కర్త & ఆధునిక రేడియో పితృ ఎడ్విన్ హౌవర్డ్ ఆర్మ్ స్ట్రాంగ్

అది 1935 నవంబర్ 5వ తేదీ. న్యూయార్క్‌లోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రేడియో ఇంజనీర్స్ నిర్వహిస్తున్న సదస్సులో ఓ 45 ఏళ్ల ఇంజనీరు తన పరిశోధనలను వివరిస్తూ పరికరాన్ని ప్రదర్శించి అది ఎంత నాణ్యంగా పని చేస్తుందో చూపిస్తున్నాడు. అంతవరకు రేడియో అంటే చప్పుళ్ళ రొద, శబ్దాల ఎగుళ్ళు, దిగుళ్ళు వగైరా వగైరా. అయితే ఆ రోజు తొలిసారి ఆ రేడియో ఇంజనీర్లంతా ఆశ్చర్యపడేలాగా చెవులప్పగించి చూస్తూ ఉండి పోయారు... ఆ ప్రసారంలో ఎదురుగా నిలబడిన వ్యక్తి మాట్లాడినట్టు, తమ ఎదురుగా ఆ సంగీత వాద్యాలను వాయించినట్టు ఆ రేడియో ప్రసారం హాయిని గొలిపింది. ఆ శాస్త్రవేత్త పేరు ఎడ్విన్ హౌవర్డ్ ఆర్మ్ స్ట్రాంగ్ (Edvin Howard Armstrong). ప్రసారాల్లో నాణ్యమైన, చప్పుళ్ళు లేని రేడియో అంటూ ఆయన ప్రదర్శించినది ఎఫ్.ఎం. రేడియో. నిజానికి మార్కొని రేడియో కనిపెట్టాడన్న రోజు నుంచి మళ్లీ ఎడ్విన్ ఆర్మ్ స్ట్రాంగ్ తన ఫ్రీక్వెన్సీ మోద్యులేషన్ లేదా ఎఫ్.ఎం. రేడియో కనిపెట్టే దాకా ప్రసారాలలో అనవసరమైన శబ్దాలు, ఇబ్బంది పెట్టే చప్పుళ్ళు తప్పనిసరిగా ఉండేవి. ఎఫ్.ఎం. విధానం రాగానే; మార్కొని రూపొందించిన 'యాంప్లిట్యూడ్ మోద్యులేషన్' లేదా 'ఎ.ఎం.' రేడియో ప్రసార విధానం త్వరగానే అటక ఎక్కింది.



'ఎడ్విన్ హౌవర్డ్ ఆర్మ్ స్ట్రాంగ్' ను ఆధునిక రేడియో పితగా కొనియాడతారు, ఎందుకంటే ఆయన ఆవిష్కరణలతో సమాచార ప్రసార విధానం తన రూపురేఖలను మార్చుకున్నది కనుక. న్యూయార్క్ నగరంలో 1890 డిసెంబర్ 18న ఎడ్విన్ హౌవర్డ్ ఎంతో మతపరమైన నిష్టగల కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుంచే చిన్న పరికరాలు, యంత్రాలు, వాటి పనితనం, చిన్న చిన్న రిపేర్లు వంటి వాటి పట్ల ఆసక్తి చూపేవాడు. చిన్నతనంలో చేతికి దెబ్బ తగలడంతో తన శక్తియుక్తులను తనకు తానే నేర్చుకోవడంలో దృష్టి పెట్టాడు. విద్యుత్ శక్తి పట్ల ఆసక్తి కలిగి, ఇంట్లోనే చిన్నచిన్న పరికరాలు రూపొందించేవాడు. తన 14 ఏళ్ళ వయసులో గూగ్లీల్మో మార్కొని (Guglielmo Marconi) రూపొందించిన 'వైర్లెస్ టెలిగ్రఫీ' (wireless telegraphy) ఆవిష్కరణ పట్ల ఆసక్తి కలిగి అటువంటి ఆవిష్కర్త కావాలని కలలుగనే వాడు. ఈ పట్టుదల కారణంగా 1913లో కొలంబియా విశ్వవిద్యాలయం నుంచి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ సంపాదించాడు. మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో ఆర్మ్ స్ట్రాంగ్ ప్రతిభ ప్రకాశించింది. 1912లో తను రూపొందించిన రీజనరేటివ్ సర్క్యూట్‌ను మరింత మెరుగుపరిచి రేడియో సంకేతాల నాణ్యతను పెంచి, ఎక్కువ దూరం ప్రయాణం చేసేలా విజయం సాధించాడు. భవిష్యత్తు రేడియో నిర్మాణాలకు అన్నిటికీ ఇది ఆయువుపట్టు లాగా మారింది. లి.డి. ఫారెస్ట్ (Lee de Forest) తన ఆవిష్కరణను దొంగలించాడనే అభియోగంతో కోర్టుకెక్కాడు. దీనికి ఎంత మాత్రమూ చలించని ఆర్మ్ స్ట్రాంగ్ 1918లో ఎక్కువ తరంగదైర్ఘ్యం ఉన్న రేడియో తరంగాలను మరింత బలోపేతం చేసే సూపర్ హెటిరోడైన్ రిసీవర్ (Superheterodyne receiver)ను రూపొందించాడు. నేటికీ రేడియో, టెలివిజన్ సెట్లలో ఈ ఆవిష్కరణే ప్రధాన భూమిక వహిస్తోంది. తర్వాత తనకెంతో కీర్తి సంపాదించి పెట్టిన ఫ్రీక్వెన్సీ మోద్యులేషన్ అంటే ఎఫ్.ఎం. రేడియోను 1933లో ఆవిష్కరించారు. దీని ఫలితంగానే ప్రసారాలు పూర్తిగా కొత్త రూపం ధరించి మ్యూజిక్ రేడియో, టీవీ ఆడియో, మొబైల్ కమ్యూనికేషన్ ఇంకా చెప్పాలంటే ఉపగ్రహ అనుసంధానం వంటివి సరికొత్త రూపు ధరించి రేడియోకు మరింత సార్వత్రికతను సంతరింప చేశాయి.

పట్టుదల, పరిశ్రమ జోడు గుర్రాలుగా జీవన విజయాలు సాధించిన ఎడ్మిన్ హౌవర్డ్ ఆర్మ్ స్ట్రాంగ్ అంతే సాహసంగా, చమత్కారంగా ప్రేమించి పెళ్లి చేసుకుని ముందుకు వెళ్లాడు. ఆవిష్కరణలు సాధించిన మేధావులే మార్కెట్లో తెగబడి వాణిజ్య పోరాటం చేయడం రేడియో ప్రసారాలు విషయంలో కూడా కనబడుతుంది. తను సాధించిన ఫ్రీక్వెన్సీ మాద్యులేషన్ ఆవిష్కరణలకు సంబంధించిన 17 పేటెంట్లను రక్షించుకోవడం కోసం సుమారు 20 వ్యాజ్యాలను ఎదుర్కోవాల్సి వచ్చింది. 1940లో ప్రపంచంలోనే తొలి ఎఫ్.ఎం. రేడియో కేంద్రాన్ని ప్రారంభించిన ఎడ్విన్, అప్పటికి పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టిన యాంప్లిట్యూడ్ మాడ్యులేషన్ రేడియో ప్రసారాలకు సంబంధించిన కంపెనీలకు తీవ్రమైన విఘాతాన్ని కలిగించాడు. ఫలితంగా ఎన్నో కుట్రలు వాణిజ్యాల కుతంత్రాలు మొదలయ్యాయి. ఎంతో నమ్మకమైన మిత్రుడే ప్రత్యర్థితో వ్యాపారపరంగా చేతులు కలపడంతో విశేషమైన నష్టాలు మీద పడ్డాయి. చివరికి కోర్టు తీర్పు ఫలితంగా పూర్తిగా నష్టపోవడంతో 63 ఏళ్ల వయసులో 1954 జనవరి 31న తన నివాసం 13వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంతటి మహా ఆవిష్కర్త జీవన పోరాటంలో తీవ్రంగా నష్టపోయి, హృదయ విదారకంగా అంతర్ధానమయ్యారు.


- డా. నాగసూరి వేణుగోపాల్
ఆకాశవాణి విశ్రాంత సంచాలకులు, ప్రముఖ సైన్స్ రచయిత,
m : 9440732 392




# కొబ్బరి చెట్టు

హాయ్ బాలలూ ఎలా ఉన్నారు? సమ్మేటివ్ పరీక్షలు బాగా రాశార...? ఈ డిసెంబర్ నెల బాలచెలిమి సంచికలో మనం కొబ్బరి చెట్టు గురించి తెలుసుకుందాం. సరేనా! కొబ్బరి ఒక ముఖ్యమైన పామ్ కుటుంబానికి చెందిన వృక్షం. దీని శాస్త్రీయ నామం కోకాస్ న్యూసిఫెరా. సాధారణంగా కొబ్బరి చెట్టును టెంకాయ చెట్టు, నారికేల వృక్షం అని కూడా పిలుస్తారు. హిందువులు శుభకార్యాలలో కొబ్బరికాయ కొట్టడం దేవుడిపై ఉన్న భక్తిని చాటుతుంది. ఉష్ణ మండల ప్రాంతంలో కొబ్బరి తోటలు విస్తృతంగా సాగు చేయబడుతున్నాయి. కొబ్బరి చెట్టు జీవితకాలం దాదాపు 80 సంవత్సరాలు. ఇది 30 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతుంది. ఈ చెట్టును కల్పతరువు అని కూడా అంటారు. ఎందుకంటే ఈ చెట్టు ఆకులు, పువ్వులు, కాండం, కొబ్బరి నీళ్లు కొబ్బరికాయలు, కొబ్బరి పీచు ఇలా ప్రతి ఒక్కటి ఉపయోగపడుతాయి. ఆకులు, కాండంతో పైకప్పులు, టోపీలు, బుట్టలు, ఫర్నిచర్, చాపలు, తాళ్లు, దుస్తులు, చీపుర్లు, చేతి ఫ్యాన్లు, అలంకరణ ఆభరణాలు, సంగీత వాయిద్యాలు, షాంపు కంటైనర్లు, పనిముట్లు మరియు లేపనాలు, సబ్బులు ఇతర అనేక రకాలు వస్తువులు తయారుచేస్తారు. కొబ్బరి ఆకులతో, కొబ్బరి కాయల పీచుతో పరుపులు ఇతర వస్తువులు తయారుచేస్తారు. ప్రతిరోజు మనం తల వెంట్రుకలకు వాడే కొబ్బరి నూనె కొబ్బరికాయల నుండి ఉత్పత్తి చేస్తారు. కేరళ, తమిళనాడు, గోవా, కర్ణాటక, ఒరిస్సా వంటి సముద్ర తీర ప్రాంతాలలో కొబ్బరి చెట్లు బాగా పెరుగుతున్నందున అక్కడ ఉన్న ప్రజలు కొబ్బరి నూనెను వంట నూనెగా (పల్లి నూనె లాగా) వాడుతారు. సాధారణంగా కొబ్బరి కాయలు వేద కాలం నుండి భారతదేశంలో వాడినట్లు తెలుస్తుంది. వాల్మీకి రామాయణంలోని కిష్కింధకాండ మరియు అరణ్యకాండలో కొబ్బరికాయ ప్రస్తావన ఉన్నది. కొబ్బరి చెట్టును ఆంగ్లంలో "కోకోనట్ ట్రీ" అంటారు. క్రీస్తుపూర్వం 1500 ప్రాంతంలో భారత ఉపఖండంలో కొబ్బరి పీచును మొదట ఉపయోగించారని చరిత్రకారులు విశ్వసిస్తున్నారు. కొబ్బరి చెట్టు ఒక బహుళ ప్రయోజనాలు ఉన్న వృక్షం. కొబ్బరి చెట్టు నుండి లభించే కొబ్బరి కాయలు ప్రతి పూజా కార్యక్రమంలోనూ ఉపయోగిస్తాం. కొబ్బరి కాయలు కొట్టడం దేవునిపై ఉన్న భక్తికి ప్రతిరూపంగా భావిస్తాం. హిందువులకు ఇది అత్యంత పూజా ద్రవ్యం. మన భారతదేశం, అమెరికా, వియత్నాం, బంగ్లాదేశ్, మలేషియా, ఐరోపా దేశాల వంటి ప్రపంచవ్యాప్తంగా 140 దేశాలకు కొబ్బరితో తయారైన వస్తువులను ఎగుమతి చేస్తున్నారు. కేరళ రాష్ట్రంలో భగవతి దేవిని కొబ్బరి చెట్టు యొక్క ఆత్మగా భావిస్తారు. కొబ్బరి చెట్లు చూడడానికి తాటి చెట్లలాగే నిటారుగా పెరుగుతాయి. నాటిన మూడు సంవత్సరాల నుండి కొబ్బరి కాయలు కాస్తాయి. మన తెలంగాణ ప్రాంతంలో కూడా ప్రతి ఇంటి ఆవరణలోనూ, బావుల దగ్గర, తోటలలో అవసరాల కోసం కొబ్బరి చెట్లు పెంచుకుంటారు. పర్యావరణపరంగా కూడా కొబ్బరి చెట్లు చూడడానికి ఎంతో అందంగా, ఆహ్లాదకరంగా ఉంటాయి. పెళ్ళిళ్లు, పుట్టినరోజులు, జాతరలు వంటి శుభకార్యాలలోనూ కొబ్బరి మట్టల ఆకులు కట్టడం సంప్రదాయంగా శుభ సూచికంగా చూస్తున్నాం. వీటి అలంకరణ ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఒక్కొక్క కొబ్బరి చెట్టు సంవత్సరానికి 50 నుండి 200 కొబ్బరి కాయలను ఉత్పత్తి చేస్తుంది. ఇది ఒక ముఖ్యమైన ఆహార పంట. కొబ్బెర ఎలాంటి కలుషితం లేనటువంటి ఆహారం. కొబ్బెరలో ప్రధానంగా బి, సి విటమిన్లు ఉంటాయి. కొబ్బరి పాలు తాగడం వల్ల శరీరానికి అనేక పోషకాలు లభిస్తాయి. కొబ్బరి బొండాల నుండి లభ్యమయ్యే నీరు శరీరానికి ఎంతో మేలు కలగజేస్తుంది. కొబ్బరి నీళ్లు కూల్ డ్రింక్స్ కంటే 100 రెట్లు మంచిది. కొబ్బరి చెట్ల సాగును ఇటీవల కాలంలో రైతులు ఆసక్తిగా పెంచుతున్నారు. తక్కువ పెట్టుబడితో కొబ్బరి తోటలను సాగు చేస్తున్నారు. ఒక్కొక్క కొబ్బరికాయ 30 రూపాయల వరకు ధర పలుకుతుంది. కొబ్బరి కుడుకను వివిధ వంటలలో విరివిగా ఉపయోగిస్తారు. కొబ్బెరతో చేసిన లడ్డూలు చాలా రుచిగా ఉంటాయి.ఇట్లా అనేక రకాల ప్రయోజనాలు ఉన్న కొబ్బరి చెట్లను మనం కూడా ఇంటి ఆవరణలో, పాఠశాలల్లో పెంచుకుందాం.

– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655



రైతుల పండుగ
రచన: జుగాష్‌విలి
బొమ్మలు:
తాతయ్య : గోపీ! లాస్ట్ మంత్ బాలల పండుగ చేసుకున్నారు కదా! ఈ నెల రైతుల పండుగ ఉంది తెలుసా?
గోపి: రైతుల పండుగా! రైతులంటే ఎవరు తాతయ్యా?
తాతయ్య : రైతులంటే ఎవరో తెలియదు. మన చదువులిలా ఉన్నాయి మరి. రోజూ మనం తినే తిండి, కూరగాయలు, పండ్లు, మిర్చి, మనం వేసుకునే వస్త్రాలకు అవసరమైన ప్రత్తి పండించే వ్యవసాయదారులే రైతులు. మనం తాగే పాల కోసం పశుపోషణ కూడా చేస్తారు.
గోపి : పండుగ ఎప్పుడు తాతయ్య! దీని ప్రాధాన్యత ఏమిటి?
తాతయ్య : కేంద్ర వ్యవసాయ మంత్రిగా పని చేసిన చౌదరి చరణ్ సింగ్ రైతు నాయకుడు. రైతుల సంక్షేమానికి చేసిన కృషికి గుర్తుగా డిసెంబర్ 23 రైతు దినోత్సవంగా ప్రభుత్వం ప్రకటించింది.
గోపి : ఆ రోజు ఏం చేస్తారు?
తాతయ్య : రైతుల సమస్యలు, సాంకేతిక విషయాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సదస్సులు, సమావేశాలు నిర్వహించి చర్చిస్తారు.
గోపి : ఇవన్నీ ఎవరు చేస్తారు?
తాతయ్య : ప్రభుత్వ అధికారులు, స్థానిక సంస్థలు, వ్యవసాయ రంగ నిపుణులు ఉత్పత్తిలో కొత్త పద్ధతులు, సేంద్రియ ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, జలవనరుల వినియోగం, ఎరువుల వినియోగం పట్ల జాగ్రత్తలు వివరిస్తారు.


గోపి : ఆ రోజు ఇంకా ఏం చేస్తారు?
తాతయ్య : రైతులు దేశానికి చేస్తున్న సేవ, వారి కృషి, త్యాగం ప్రజలకు వివరించి వారిని చైతన్యపరిచే వ్యవసాయ ప్రదర్శనలు, ఎడ్ల పందాలు, వివిధ రకాల పంటలు, ధాన్యాలు, ప్రదర్శిస్తారు. రైతుల కృషిని కీర్తిస్తూ వారిని ప్రోత్సహించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు.
గోపి : రైతుల మంచి కోసం ఏం చేయాలి తాతయ్య?
తాతయ్య : వ్యవసాయ రంగం మన దేశ అభివృద్ధికి కీలకం. ఆధునిక పద్ధతుల పట్ల అవగాహనతో పాటు నాణ్యమైన విత్తనాలు, కల్తీలేని ఎరువులు, తగిన జలవనరులు రైతులకు అందుబాటులోకి తేవాలి. తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు ఇవ్వాలి. పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించాలి. పంటను ప్రభుత్వమే కొనాలి. ప్రకృతి విపత్తుల వల్ల జరిగే నష్టాలకు ప్రభుత్వమే అండగా నిలవాలి.
రుణాలు
BANK
గోపి : మనకు తిండి పెట్టే రైతును ఎలా గౌరవించుకోవాలి?
తాతయ్య : రైతుల కృషిని, వారి నైపుణ్యాలను ప్రోత్సహిస్తూ రైతులకు పురస్కారాలు, అవార్డులు, నగదు బహుమతి, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో యిచ్చి గౌరవించుకోవాలి.
గోపి : రైతులకు మనమేం చేయగలం తాతయ్య?
తాతయ్య : రైతు లేనిదే మనిషి మనుగడ లేదని మొదటగా గుర్తించాలి. వారి కృషి ఏ ఇతర రంగాల కృషి కంటే తక్కువ కాదనని అంగీకరించాలి. సాంఘిక అసమానతకు గురికాకుండా రైతును కాపాడుకుంటూ గౌరవించాలి. గ్రామాలే భారత దేశానికి వెన్నెముక అన్న గాంధీ గారి మాటలను నిరంతరం గుర్తు పెట్టుకోవాలి.




# పంచ్‌ల పవర్... పతకాల శవర్!

## ప్రపంచ కప్ 2025 ఛాంపియన్‌గా నిలిచింది

2025 ప్రపంచ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లో భారత బాక్సర్లు మరోసారి తమ శక్తి, ప్రతిభను నిరూపించారు. గ్రేటర్ నోయిడాలో ఐదు రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో భారత్ మొత్తం 20 పతకాలను గెలుచుకుని ఆకట్టుకుంది. నిఖత్ జరీన్ మరియు జైస్మిన్ లంబోరియా స్వర్ణ పతకాలతో దేశానికి గౌరవం తెచ్చారు. మొత్తం తొమ్మిది బంగారు, ఆరు రజత, ఐదు కాంస్యాలతో భారత బృందం మేటి ప్రదర్శన చూపింది.

మహిళా బాక్సర్ల ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. మీనాక్షి హుడా 48 కిలోల్లో మొదటి స్వర్ణాన్ని అందించి శుభారంభం పెట్టింది. ప్రీతి పవార్, అరుంధతి చౌదరి, నూపుర్ షియోరాన్, పర్వీన్ హుడా తమ తమ బౌట్లలో ప్రత్యర్థులను ధైర్యంగా ఎదుర్కొని బంగారు పతకాలను సాధించారు. సాయంత్రం సెషన్‌లో నిఖత్ జరీన్ ఆధునిక శైలిలో పోరాడి 51 కిలోల విభాగంలో 5–0 తేడాతో గెలిచింది. వెంటనే జైస్మిన్ లంబోరియా 57 కిలోల కేటగిరీలో పారిస్ ఒలింపిక్స్ పతక విజేత వు షిహ్–యిపై 4–1తో విజయం సాధించి మరో గోల్డ్‌ను భారత్ ఖాతాలో వేసింది.

పురుషుల విభాగంలో సచిన్ సివాచ్ 60 కిలోల్లో 5–0 తేడాతో గెలిచి బంగారు పతకం అందించాడు. హితేష్ గులియా 70 కిలోల కేటగిరీలో కఠిన పోరులో 3–2 తేడాతో స్వర్ణాన్ని కైవసం చేసుకున్నాడు. జదుమణి సింగ్, పవన్ బర్త్వాల్, అభినాష్ జమ్వాల్, అంకుష్ పంగల్, నరేందర్ బెర్వాల్ మంచి పోరాటం చేసినప్పటికీ రజతాలతో సరిపెట్టుకున్నారు. నీరజ్ ఫోగట్, సావీతి బూరా, సుమిత్ కుందు, జుగ్నూ, నవీన్‌లు బ్రోంజ్‌లు సాధించి భారత పతక పట్టికను బలోపేతం చేశారు.

ఈ విజయాలు భారత బాక్సర్ల పట్టుదల, శిక్షణ, క్రీడాస్ఫూర్తికి నిదర్శనం. పిల్లలకు కూడా ఇది పెద్ద ప్రేరణగా నిలుస్తుంది. కష్టపడి పనిచేస్తే ప్రపంచ వేదికపై కూడా విజయం సాధించవచ్చని స్పష్టం చేస్తుంది. 2025 ప్రపంచ బాక్సింగ్ కప్‌లో భారత ప్రదర్శన దేశం మొత్తాన్ని గర్వపడేలా చేసింది.

– బాలచెలిమి డెస్క్

కథ

# పంట బీమా ప్రతి రైతుకు రక్ష




సింగారం గ్రామంలో నర్సయ్య – లక్ష్మీ దంపతులు ఉన్నారు. వీరు వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఇద్దరు కుమార్తెలున్నారు. రెండున్నర ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగుచేశారు. నీళ్లు సరిపడా లేక పోవడం వలన వర్షాధార పంటగా మొక్క జొన్న వేసారు. దున్నడం, కలుపు తీయడం, ఎరువులు చల్లడం చాలా ఖర్చు చేశారు. వీరి కుమారుడు రాములు 9వ తరగతి. చదువుకుంటూనే పొలం పనులకు సహకరించాడు. అడపా దడపా పడిన వర్షాలకు మొక్క జొన్న జుట్టు వేస్తుంది. కంకులు బయటకు వచ్చాయి. కానీ విత్తులు పాలతో లేతగానే ఉన్నాయి. వర్షాలు లేకపోవడంతో అనావృష్టితో మొక్క జొన్న విత్తులు పూర్తిగా కాకుండానే చేను అంతా ఎండిపోతుంది. నర్సయ్య కుటుంబం బాధలో మునిగిపోయింది. ఎండిన మొక్కజొన్న కోస్తారు. కంకుల బూరు తీస్తారు. ఎక్కడనో కొంచెం అక్కడక్కడా బలపడిన విత్తులున్నాయి. అన్నీ కలిపి నాలుగు బస్తాల కంకులు అవుతాయి. కైకిళ్లు రెండు బస్తాలు వేయగా కౌలు బస్తా పోగా మిగిలిన ఒక బస్తాను చూసిన నర్సయ్య, రాములు కన్నీటి పర్యంతం అయ్యారు. పెట్టుబడులు రాకపోగా చేసిన కూలీ పడలేదు. రాములు బడికి మరీ తప్పించి దున్నడం, గడ్డి తీయడం, మందులు చల్లడం, కాపలా కాయడం, కోయడం, కంకి బూరు తీయడం అనేక పనులు చేసాడు. రెండు రోజుల కైకిలి కూడా రానీ ధాన్యం చూసి కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు. నర్సయ్య కుటుంబంలో కూతురు పెళ్లి ఖర్చులు, లక్ష్మి అనారోగ్య ఖర్చులు, పెట్టుబడి ఖర్చులు తలుచుకుంటూ కన్నీళ్లు పెట్టాడు. రైతులకు ములుగర్ర మిగులదన్నట్టు బాధపడ్డాడు. కొడుకు రాములు నాన్నా పంటభీమా చేస్తే బాగుండు. మా బడిలో సార్ చెప్పాడు. కరువుకాటకాలు వచ్చినా, వరదలు వచ్చినా పంటలు నష్టం జరిగితే డబ్బులు కట్టిస్తారటా. మనము కడితే పంట భీమా వచ్చేది. ఎల్లారెడ్డి పేటలో పంట ఎండిపోతే భీమా చేసిన రైతులకు బీమా డబ్బులు చెల్లించారటా అన్నాడు. అనగానే సరే మనంకూడా పంట బీమా కడుదాం, మనలాంటి రైతులకు చెబుదాం అన్నాడు నర్సయ్య.


– డా.వాసరవేణి పర్శరాములు

బాలసాహిత్య రచయిత, పరిశోధకులు

m: 9492193437

# కోతి మేకు కథ



అనగా అనగా ఒక ఊరు. ఆ ఊరి పేరు అరిదుర్గం. ఆ ఊరిలో శుభదత్తుడు అనే వర్తకుడు ఉన్నాడు. ఆ ఊరికి దగ్గరగా ఉన్న ఒక తోటలో ఒక పాడుబడిన దేవాలయం ఉంది. అతడు ఆ దేవాలయాన్ని బాగు చేయించడం మొదలు పెట్టాడు. అందుకోసం అతడు కలప కొని వడ్రంగుల చేత దూలాలుగా కోయిస్తున్నాడు. వడ్రంగులు ప్రతి దూలాన్నీ మధ్యకి కోస్తూ, రంపాన్ని సులువుగా అటూయిటూ లాగేందుకు వీలుగా దానిలో కొయ్యమేకును కొట్టేవారు. ఒకనాడు వడ్రంగులు ఒక దూలాన్ని రంపంతో కొంతవరకు కోసి, భోజనానికి వేళ కావడంతో ఇళ్ళకు వెళ్ళారు. దూలంలోకి కొట్టిన మేకు ఇంకా అలాగే ఉంది.

ఆ సమయంలో చాలా కోతులు అక్కడికి వచ్చాయి. ఆ కోతులన్నీ చెట్లమీద కుప్పిగంతులు వేయసాగాయి. ఆ గుంపులోని ఒక కోతి ఆ దూలాలు ఉన్న చోటుకి వచ్చింది. ఊరికే ఉండలేక సగం కోసిన దూలం మీద కూర్చుని ఆడుతోంది. చీలిక మధ్యలోకి కాలు దూర్చి కూర్చుంది. చేతులతో కొయ్య మేకును ముందుకీ వెనక్కీ నాలుగుసార్లు ఊపి, బలంగా పైకి లాగింది. మేకు ఊడిరావడంతో దూలం చీలికలు రెండూ 'ఠపీ'మని ఏకం అయ్యాయి. వాటి మధ్యలో కోతి నలిగి చచ్చిపోయింది.

**నీతి : తనకు సంబంధించని పనులలో జోక్యం చేసుకోకూడదు**

సేకరణ : అమరావతి



# మాయా ఉంగరం

## కాన్‌స్టాంటిన్ పాస్తొవ్‌స్కీ

అనగనగా ఒక ఊరిలో ఒక చిన్న పాప వాళ్ళ తాతయ్యతో కలిసి నివసిస్తుండేది.

అది శీతాకాలం.

వాళ్ళ తాతయ్య జబ్బు పడ్డాడు. అతనికి పొగ తాగే అలవాటుంది.

తాతయ్య పొగాకు కోసం, పాప బయటకొచ్చింది.

వాళ్ళ ఇంటి పక్కన ఒక రైల్వే స్టేషన్ ఉంది.

దానికి అవతల పొగాకు అమ్మే దుకాణం ఉంది. అక్కడకు వెళ్ళింది పాప.

పొగాకు కొని ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు రైల్వే స్టేషన్‌లో సైనికులు కనపడ్డారు. "పాప, ఏంటి నీ చేతుల్లో ఉన్నది" అడిగాడు ఓ సైనికుడు.

"మా తాతయ్య కోసం పొగాకు తీసుకెళ్తున్నాను" అంది పాప.

"నాకు కొంచెం అమ్ముతావా?" అన్నాడు సైనికుడు.

"లేదు" అంది పాప.

చిన్నబోయాడు సైనికుడు.

"కొంచెం ఊరికినే ఇస్తాను" అని ఆ సైనికుడికి కొంచెం పొగాకు ఇచ్చింది.

ఎంతో ఆనందించిన సైనికుడు పాపకి బహుమతిగా ఓ 'మాయా ఉంగరం' ఇచ్చాడు.

"ఇది అద్భుతమైన ఉంగరం. ఈ ఉంగరాన్ని మధ్యవేలుకు పెట్టుకుంటే, నీవు మీ తాతయ్య ఆరోగ్యంగా ఉంటారు. ఈ ఉంగరాన్ని చూపుడు వేలుకి పెట్టుకుంటే, నీవు చాలా ఆనందంగా ఉంటావు" అన్నాడు సైనికుడు.

ఆ సైనికుడికి మంత్రవిద్యలు తెలుసు.

పాప ఆనందంతో మాయా ఉంగరాన్ని తీసుకుని సైనికునికి కృతజ్ఞతలు చెప్పింది. దారిలో వెళ్తూ ఆ మాయా ఉంగరాన్ని చిటికెన వేలుకు పెట్టుకుంది. పాప చిటికిన వేలు బాగా చిన్నది. ఉంగరం కొంచెం పెద్దది. కాబట్టి అది జారి మంచులో పడిపోయింది. ఎంత వెతికినా దొరకలేదు.

ఏడుస్తూ ఇంటికి పోయి, జరిగిన కథంతా వాళ్ళ తాతకు చెప్పింది. తాతకు పొగాకు ఇచ్చింది.

"బాధపడకు, మన ఉడుత నీకు సాయం చేస్తుందేమో అడుగు" అని సలహా ఇచ్చాడు తాతయ్య.

పాప ఉడుతని సాయమడిగింది. ఉడుత ముందు

కొంచెం బెట్టుచేసింది. చివరికి ఒప్పుకుంది. ఉడుత, పాప కలిసి రోజూ ఆ ఉంగరం కోసం వెతికేవాళ్ళు. చివరికి ఓ రోజు మాయా ఉంగరం పాపకు దొరికింది. పాప ఆనందానికి అవధుల్లేవు. ఉడుతకు కృతజ్ఞతలు చెప్పింది.

మాయా ఉంగరాన్ని మధ్య వేలుకు ధరించింది. ఇంటికొచ్చి చూసేసరికి తాతయ్య ఆరోగ్యంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

"చిన్నారీ! నీవు బయటకు వెళ్తూ తలుపు మూయలేదు.

తాజా గాలి గదిలోకి వచ్చింది, నా జబ్బు నయం చేసింది" అన్నాడు తాతయ్య.

ఉంగరం విశేషం చెప్పింది పాప. తాతయ్య వంట చెరకు నరకడం లాంటి పనుల్లో పడ్డాడు. వంట చేయడానికి పాప, తాతయ్యకు సాయం చేసేది.

తరువాతి రోజు పాప మాయా ఉంగరాన్ని తన చూపుడు వేలుకు పెట్టుకుంది.

వాళ్ళ ఇంటిపక్కనున్న అడవి ఎంతో ప్రకాశవంతంగా వెలిగింది. చెట్లు పువ్వులు పూశాయి. పండ్లను కాశాయి. నీలి ఆకాశం ఎంతో అందంగా మెరిసింది. సూర్యుడు, మబ్బుల వెనక నుంచి తీవిగా బయటకు వచ్చాడు.

ఈ దృశ్యాలను చూసి పాప, తాతయ్య, ఉడుత ఆనందంతో నృత్యం చేశారు. వాళ్ళు ఈ రోజుకీ ఆనందంగానే ఉన్నారు.

స్వేచ్ఛానువాదం : అనిల్ బత్తుల
m : 81792 73971
ఇంగ్లీష్ : ద లిటిల్ స్టీల్ రింగ్
రచయిత : కాన్‌స్టాంటిన్ పాస్తోవ్‌స్కీ
ఇంగ్లీష్ అనువాదం : జేమ్స్ రియోర్డన్

# చెన్నై ఎంజిఆర్ సెంట్రల్‌లో ప్రత్యేక బుక్ వెండింగ్ మెషీన్ ప్రారంభం





చెన్నై: రైల్వే స్టేషన్లలో సాధారణంగా కూల్‌డ్రింక్స్, హాట్‌చిప్స్, సమోసాలు, టీ వంటి తినుబండారాలే మన దృష్టిని ఆకర్షిస్తాయి. కానీ చెన్నై ఎంజీఆర్ సెంట్రల్‌లోని ప్లాట్‌ఫాం నం.6 వద్ద కొత్తగా ఏర్పాటు అయిన బుక్ వెండింగ్ మెషీన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తమిళనాడులో ఇలాంటి సదుపాయం అందించబడటం ఇదే మొదటిసారి. ఈ యంత్రం, మయావతి స్ఫూర్తితో రూపుదిద్దుకుంది. ఇది కేవలం ఒక కొత్త సదుపాయం మాత్రమే కాకుండా, ప్రయాణంలో చదవడానికి ఇష్టపడే వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వినూత్నమైన ప్రయోగం కూడా. ఈ బుక్ వెండింగ్ మెషీన్ సాధారణ వెండింగ్ మెషీన్‌ల మాదిరిగానే పని చేస్తుంది. ఇందులో వివిధ రకాల పుస్తకాలు.. నవలలు, జీవిత చరిత్రలు, కథలు, పిల్లల పుస్తకాలు, ప్రయాణ కథనాలు వంటివి అందుబాటులో ఉంటాయి. ప్రయాణికులు తమకు నచ్చిన పుస్తకాన్ని ఎంపిక చేసుకుని సులభంగా కార్డ్, UPI లేదా ఇతర డిజిటల్ పేమెంట్ మార్గాల ద్వారా చెల్లించి వెంటనే పుస్తకాన్ని పొందవచ్చు.

స్టేషన్లలో వేచి ఉండే సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలనే వారికి ఇది గొప్ప అవకాశం. పుస్తకాల ప్రేమికులు మాత్రమే కాక, చదవడం అలవాటు చేసుకోవాలనుకునే యువతకు కూడా ఈ సదుపాయం ఉపయోగపడుతోంది. రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లలో పఠన సంస్కృతిని ప్రోత్సహించే ఈ ప్రయత్నం, ఇప్పటికే ప్రయాణికుల నుండి మంచి స్పందనను పొందుతోంది. ఈ వినూత్న ప్రయత్నం, సాంకేతికత మరియు పుస్తకాల ప్రేమను కలిపి, రైల్వే స్టేషన్లను మరింత సానుకూల, సృజనాత్మక వాతావరణంగా మార్చే ప్రయత్నం.

కథ

# ముగ్గురు కొడుకులు




ఒక ఊరిలో రామయ్య మరియు జానకమ్మ అనే భార్య, భర్తలు ఉండేవారు. వారికి రవి, రమణ, రాజు అనే ముగ్గురు కొడుకులు ఉన్నారు. రామయ్య మరియు జానకమ్మ వ్యవసాయం చేసుకుంటూ జీవించే వారు. రవి పట్టణంలో పెద్ద కంపెనీలో ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు, మరియు రమణ అమెరికాలో డాక్టర్‌గా పని చేస్తున్నాడు. రాజు మాత్రం డిగ్రీ పూర్తి చేసి సొంత ఊళ్ళోనే వ్యవసాయం చేస్తున్నాడు. ఒక రోజు రామయ్య ఇంటికి తన స్నేహితుడు భీమయ్య వచ్చాడు. భీమయ్య ఆ ఊరిలోనే అందరికంటే ధనవంతుడు. తనకు ఒక్కగానొక్క కుమార్తె ఉంది. తనకి పెళ్ళి సంబంధాలు చూస్తున్నాడు. ఆ పని మీద ఒక రోజు భీమయ్య, రామయ్య ఇంటికి వచ్చాడు. రామయ్య విచారంగా ఉండటం చూసి, ఏమిటి రామయ్య విచారంగా ఉన్నావు అని అడిగాడు భీమయ్య. ఏమిలేదు భీమయ్య, నా ఇద్దరు కొడుకులు ప్రయోజకులైతే అయ్యారు. కాని మూడో వాడి గురించే నా దిగులంతా, వాడి సంపాదన అంతంత మాత్రంగానే ఉంది అని అన్నాడు. అప్పుడు భీమయ్య డబ్బుదేముంది మిత్రమా ఈ రోజు ఉంటుంది రేపు పోతుంది గుణము ముఖ్యం గానీ అంటాడు. నేను నీ ముగ్గురు కొడుకులను గమనించాను, నీ ముగ్గురు కొడుకుల్లో ఉత్తముడు, నీ మూడవ కొడుకే. రవి కి నోటిదురుసు ఎక్కువ, తోటివారిని, పెద్దవారిని మర్యాదలేకుండా మాట్లాడుతుంటాడు. రెండవ కుమారుడు తల్లిదండ్రులు ఎలా ఉన్నారో పట్టించుకోని స్వార్థ పరుడు. అమెరికా వెళ్లి ఐదు సంవత్సరాలైనా ఒక్కసారికూడా మిమ్మల్ని చూడటానికి రాలేదు.సంస్కారం లేని చదువు, తల్లిదండ్రుల మీద ప్రేమ లేని పిల్లలు ఉన్నా ఒక్కటే, లేకున్నా ఒక్కటే రామయ్య. కానీ నీ మూడవ కుమారుడికి పెద్దలపట్ల గౌరవం, తల్లిదండ్రులంటే ప్రేమ, గౌరవం ఉన్నాయి. ఇవన్నీ చూసి నేను నీ మూడవ కొడుక్కి నా కూతురిని ఇచ్చి వివాహం చేయాలనుకుంటున్నాను. మరి నీ అభిప్రాయం ఏమిటో చెప్పు అని అడిగాడు భీమయ్య. అవును భీమయ్య నువ్వు చెప్పినది నిజమే, నేను ఈ విషయాన్ని గ్రహించనే లేదు. నువ్వు ఇంతలా చెప్పాలా, మంచి ఏదో చెడు ఏదో నాకన్నా నీకే బాగా తెలుసు. నీ ఇష్ట ప్రకారమే చేద్దాం అన్నాడు రామయ్య. ఒక రోజు తన కొడుకులందరిని ఇంటికి రమ్మని పిలిచి, తాము చేసిన పొరపాట్లను వారికి వివరించాడు రామయ్య. తమ తప్పు తెలుసుకున్న కొడుకులు క్షమించమని తల్లి తండ్రులని అడిగారు.


ఆ తరువాత కొన్ని రోజులకి అందరికి వివాహాలు జరిగి సంతోషంగా జీవించ సాగారు.

నీతి: సంస్కారము లేని చదువు బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. మంచి ఆలోచనలు కలిగిన వారికి ఆ దేవుని కృప తప్పకుండా ఉంటుంది.

– షన్మాతురా

7వ తరగతి, శ్రీ స్వామి నారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్ డే స్కూల్, చేవెళ్ల రోడ్, మొయినాబాద్ మండలం, రంగారెడ్డి జిల్లా.
m : 81253 71799

# Logical reasoning



# లాజికల్ రీజనింగ్ & ఆల్ఫాబెట్ టెస్ట్

ఆంగ్ల అక్షరమాలను చివరి అక్షరం నుండి మొదటి అక్షరం వరకు 1 నుండి 26 వరకు సంఖ్యలతో కోడ్ చేస్తే. క్రింది ఎంపికలలో ఇవ్వబడిన కోడ్లలో ఒక అర్థవంతమైన పదం దాగి ఉంది. ఆ కోడ్ ఏది?

**1. 8-18-22-14-11-15 2. 11-12-13-23-2-26 3. 8-7-9-14-22-26 4. 8-18-14-11-15-22**

**JUMBLE WORDS QUESTION 2 DETAILED SOLUTION**

| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| Alphabets | A | B | C | D | E | F | G | H | I | J | K | L | M |
| Positional value | 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 |
| Positional value | 26 | 25 | 24 | 23 | 22 | 21 | 20 | 19 | 18 | 17 | 16 | 15 | 14 |
| Alphabets | Z | Y | X | W | V | U | T | S | R | Q | P | O | N |

ప్రశ్న ప్రకారం, ఆంగ్ల అక్షరమాల చివరి అక్షరం నుండి మొదటి అక్షరం వరకు 1 నుండి 26 వరకు సంఖ్యలతో కోడ్ చేయబడింది.

ఎంపిక 1) 8-18-22-14-11-15 = HRVNKO

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సంఖ్య | 8 | 18 | 22 | 14 | 11 | 15 |
| అక్షరం | H | R | V | R | K | O |
| వ్యతిరేక అక్షరం | S | P | E | O | P | L |

ఇక్కడ, '**SIEIPL**' అనేది అర్థవంతమైన పదం కాదు.

ఎంపిక 2) 11-12-13-23-2-26

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సంఖ్య | 11 | 12 | 13 | 23 | 2 | 26 |
| అక్షరం | K | L | M | W | B | Z |
| వ్యతిరేక అక్షరం | P | O | N | D | Y | A |

ఇక్కడ, '**PONDYA**' అనేది అర్థవంతమైన పదం కాదు.

ఎంపిక 3) 8-7-9-14-22-26

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సంఖ్య | 8 | 7 | 9 | 14 | 22 | 26 |
| అక్షరం | H | G | I | N | V | Z |
| వ్యతిరేక అక్షరం | S | T | R | M | E | A |

ఇక్కడ, '**STRMEA**' అనేది అర్థవంతమైన పదం కాదు.

ఎంపిక 4) 8-18-14-11-15-22

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| సంఖ్య | 8 | 18 | 14 | 11 | 15 | 22 |
| అక్షరం | H | R | N | K | O | V |
| వ్యతిరేక అక్షరం | S | I | M | P | L | E |

ఇక్కడ, '**SIMPLE**' అనేది అర్థవంతమైన పదం.

కావున, "ఎంపిక 4" సరైన సమాధానం.

చరిత్ర పాఠాలు-10







# రెండు వేల ఏళ్ల కిందటి జైన మతం

రెండు వేల ఒక వంద సంవత్సరాల కిందట శాతవాహనులు తెలంగాణలో రాజ్య స్థాపన చేసి భారత దేశంలో చాలా ప్రాంతాలను పాలించినట్లు ముందటి వ్యాసాలలో తెలుసుకున్నాము. ఇప్పుడు ఆ కాలపు మత పరిస్థితులను గురించి తెలుసుకుందాము. శాతవాహన దేశంలో జైనం, బౌద్ధం, వైష్ణవం (భాగవత), శైవం ఒకటి తర్వాత ఒకటి వ్యాపించినట్లు ఆనాటి ఆధారాలు స్పష్టం చేస్తున్నాయి. కాబట్టి ఈ వ్యాసంలో తొలి జైన మతం గురించి తెలుసుకుందాము.


జైన సాహిత్యం మొదటి శాతవాహనున్ని జైన మతావలంబిగా పేర్కొంటున్నది. కోటలింగాల తవ్వకాల్లో లభించిన నాణేల్లో 'సమగోప'ని నాణెం మీద 'సాతవాహన' అనే పేరు మళ్లీ ముద్రించబడిన నాణేలు దొరకడాన్ని బట్టి ఇతర మతస్థుడగు సమగోపున్ని జైనమతస్థుడగు సాతవాహనుడు నిర్మూలించి తన వంశ పాలనను ప్రవేశ పెట్టాడనడానికి ఆస్కారముంది. జైన సాహిత్యం కూడా మొదటి శాతవాహనుడు తన రాజధాని నగరంలో జైనులకు చైత్యాలయాలు నిర్మించాడని తెలియజేస్తుంది.

ఇందుకు నిదర్శనంగా కోటలింగాలకు రెండు కిలోమీటర్ల దూరంలో గల (జైన) మునుల గుట్ట మీద జైన కట్టడాలు, జైనులు సల్లేఖన వ్రతం చేసిన ఆనవాళ్లు (ఏటవాలు రాతి పడకలు) కనిపిస్తాయి. వాటి దగ్గర మొదటి శాతకర్ణి నాణేలు, రాతలు లభించాయి. కోటలింగాలకు 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న స్తంభంపల్లిలోని స్తంభం జైనుల 'మానస్తంభం' అయ్యుండే అవకాశం ఉంది. కోటలింగాల దగ్గరలో గల జైనపేట, జనగామ, 'మాన'కొండూరు, మానాల, జైనాల, జన్నారం మొదలగు గ్రామాల పేర్లు కూడా మొదటి శాతవాహన రాజులు జైనాన్ని పాటించారనడాన్ని బలపరుస్తున్నాయి.

జైన గాథలు క్రీ.పూ. నాల్గవ శతాబ్ది నాటికే తెలుగు దేశంలో కళింగ, మాళవ ప్రాంతాల ద్వారా తమ మతాన్ని ప్రవేశపెట్టాయని చెప్తున్నాయి. మౌర్య అశోకుని మనుమడు సంప్రతి కూడా ఆంధ్ర, ద్రావిడ దేశాల్లో జైనం వ్యాప్తికి కృషి చేశాడట. అందుకు అమరావతి ప్రాంతంలోని వడ్డమాను కొండపై ఏర్పడిన 'సంప్రతి' విహారమే నిదర్శనం.

అక్కడే కళింగ ఖారవేలుడు మహా మేఘవాహన విహారం నిర్మించాడు. క్రీస్తు శకారంభంలో కొండ కుందాచార్యుడు (క్రీ.పూ. 50 – క్రీ.శ. 50) కొనకొండ్ల (అనంతపురం జిల్లా)లో ఆశ్రమం నిర్మించుకొని సిద్ధాంత గ్రంథాలు రాస్తూ జైనమతాన్ని ప్రచారం చేశాడు. అతని గ్రంథాల్లోని 'సమయసార' శ్వేతాంబర, దిగంబర శాఖల వారందరికీ ప్రామాణికమయింది. అయితే దిగంబరత్వం, అహింస వంటి కఠిన నియమాలు జైనం తొందరగా ప్రాచుర్యం కోల్పోవడానికి కారణమయ్యాయని తెలుస్తుంది.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 9490957078




# పొద్దు

చీకటి తలుపులు తెరుచుకొని
ఎర్రని రంగులు పులుముకొని
సూర్యుడు బయటికి వచ్చాడు..
వెలుగును తనతో తెచ్చాడు..
ముద్దు.. ముద్దుగ ఉన్నాడు..
పొద్దును "నేనే" అన్నాడూ..
పొద్దున "లేలే" అన్నాడూ..
రాత్రిని వెనుకకు పంపాడు..
పగలును ముందుకు తెచ్చాడు..

– గంగదేవు యాదయ్య
ఉయ్యాలా జంపాలా
m : 90591 12105

# బొమ్మలేద్దామా...



ఎస్. సౌమ్య, 9వ తరగతి, అరవింద హై స్కూల్, కుంచనపల్లి, గుంటూరు.





# కీలుగుర్రం

కలవచ్చె కమ్మని
కలవచ్చె వేకువన
కలలోన గగనలో
కాలు దర్శించాను

రివ్వుమని బాణమ్ము
రీతిగా పరుగెత్తు
కీలుగుర్రము పైన
గాలిలో పయనించి

గాలిలో పయనించి
గగనాలు చేరాను
గగన లోకాలకు
కలయ విహరించాను

– డా. ఎన్. గోపి
కీలుగుర్రం (బాల గేయాలు)




# బూజు నుండి పెన్సిలిన్ మందు

పెన్సిలిన్ ఇంజక్షన్ చేయించుకోని వారు నేడు అరుదు. అందరికీ అందుబాటులో ఉంటుంది. ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. ఇది కనిపెట్టిన నాటి నుండి కొన్ని వందల కోట్ల మందికి దీనిని వాడి ఉంటారు. ఇంత మహత్తరమైన పెన్సిలిన్ మందు ప్రపంచంలోకి విచిత్రంగా వచ్చింది.

లండన్‌లో సెయింట్ మేరీ హాస్పటల్ ఉంది. దానిలో అలెగ్జాండర్ ఫ్లెమింగ్ అనే ఆయన పని చేస్తుండేవాడు.

1928వ సంవత్సరం సెప్టెంబరు నెలలో ఒకరోజు. కొన్ని గాజు నాళికలను పరిశీలిస్తూ ఒక్కొక్క దాన్నే దూరంగా విసిరి వేస్తున్నాడు ఫ్లెమింగ్. ఆయన వాటిల్లో కొన్ని రకాల క్రిములను ఉంచాడు. వాటి అభివృద్ధిని పరిశీలిద్దామని ప్రయోగశాలలో ఉంచి ఊరికి వెళ్ళాడు.

వారం రోజుల తరువాత ఊరి నుంచి తిరిగి వచ్చాడు. వచ్చి వాటిని పరిశీలిస్తున్నాడు. ఒకదానిలో ఓ విచిత్రం ఆయన్ని ఆకర్షించింది. తాను ఉంచిన క్రిములు దానిలో లేవు. గాజు నాళికలోకి ఎలా వచ్చిందో ఒక రకమైన బూజు వచ్చి ఉంది.

ఆయన బుద్ధి పాదరసంలా పని చేసింది. అటువంటి బూజును సేకరించాడు. గాజు గిన్నెల్లో ఉంచాడు. వాటిలో క్రిముల్ని పెట్టాడు. క్రిములు చచ్చి ఊరుకున్నాయి.

ఒక రకమైన బూజు కొన్ని రకాల క్రిముల్ని నాశనం చేస్తుందని తెలుసుకున్నాడు. దానితో మందును తయారు చేశాడు.

ఒక జాతి బూజుకు 'పెన్సిలిన్' అనే పేరుందని ఆ పేరే ఆ మందుకు పెట్టాడు.

ఇది జరిగిన 14 ఏళ్ల తర్వాత జర్మనీ నివాసి ఎర్నెస్టు చెయిన్, లండన్‌లోని ఆక్స్ ఫర్డ్ యూనివర్శిటీలో ప్రొఫెసర్ అయిన హెరీవర్డ్, ఫ్లోరీ అనే ఇద్దరూ 'పెన్సిలిన్' పై పరిశోధనలు చేశారు. దానిని సూదుల ద్వారా శరీరం లోపలి భాగాలకు ఎక్కించి చికిత్స చేయవచ్చని నిరూపించారు. ఆ నాటి నుండి 'పెన్సిలిన్' ఇంజక్షను రూపంలో నిలిచి పోయింది.

– 'బాల కథా సౌరభం' నుండి...

# 9 తో అద్భుతం

1. ఏదైనా ఒక 3 అంకెల సంఖ్య తీసుకోవాలి.
2. దానిని 999తో గుణించుకోమనాలి.
3. ఆ మూడంకెల సంఖ్యను చెప్పమనాలి.
4. అది విని వెంటనే వారి జవాబును చెప్పాలి.

**ఉదా :** 693×999 = 692307

రహస్యం : వారు చెప్పిన సంఖ్య నుండి 1 తీసివేసి మిగిలిన సంఖ్యను జవాబులోని ఎడమ వైపుకు వేయాలి. ఆయా అంకెలకు ఎంత కలిపితే 9 వస్తుందో ఆ అంకెలను వరుసగా కుడివైపుకి వ్రాయాలి.

693 – 1 = 6 9 2 3 0 7

## BEAUTY NUMBER

35702369 x nines' multiplies

35702369 x 9 = 321321321

35702369 x 18 = 642642642

35702369 x 27 = 963963963

35702369 x 36 = 1285285284

35702369 x 45 = 1606606605

35702369 x 54 = 1927927924

35702369 x 63 = 2249249247

35702369 x 72 = 2570570568

– అంకెల మామయ్య చంద్రయ్య

m: 9440926937



# చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచార పత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

**చెలిమి క్లబ్**

పేరు : ------------------

తండ్రి పేరు : ------------------

పుట్టినతేదీ : ------------------

చిరునామా : ------------------

------------------

------------------

పిన్ : ------------------

హాబీలు : ------------------

మొబైల్ : ------------------

ఇ-మెయిల్ : ------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com






# డిజిటల్ ప్రపంచంలో విప్లవాత్మక మార్పు

### బ్లాక్‌చైన్ టెక్నాలజీ

ఇంటర్నెట్ తర్వాత ప్రపంచంలో చాలా ప్రభావం చూపిన టెక్నాలజీల్లో బ్లాక్‌చైన్ ఒకటి. 2008లో బిట్‌కాయిన్ ద్వారా ఇది ప్రారంభమయ్యింది. ఇప్పుడు బ్లాక్‌చైన్ డేటాను సురక్షితంగా, పారదర్శకంగా ఉంచే అత్యంత శక్తివంతమైన మార్గంగా మారింది. బ్లాక్‌చైన్ సాంకేతికత డేటా భద్రత, నమ్మకాన్ని, మరియు డిసెంట్రలైజేషన్ (ఏకపక్ష ఆధిపత్యం లేకుండా వ్యవస్థ)కు కొత్త అర్థాలను ఇచ్చింది.

### బ్లాక్‌చైన్ అంటే ఏమిటి?

బ్లాక్‌చైన్ అనేది ఒక డిస్ట్రిబ్యూటెడ్ లెడ్జర్ టెక్నాలజీ (Distributed Ledger Technology - DLT). బ్లాక్‌చెయిన్ అనేది మార్పు చేయలేని, భాగస్వామ్య డిజిటల్ లెడ్జర్. లావాదేవీలను బ్లాక్‌లుగా నిల్వ చేసి, ఆ బ్లాక్‌లు ఒకదానికొకటి అనుసంధానం అవుతాయి. మొత్తం డేటా ఒకే కంప్యూటర్‌లో కాకుండా అనేక కంప్యూటర్లలో నిల్వ ఉండటం వల్ల ఇది వికేంద్రీకృతంగా ఉంటుంది. ఈ నిర్మాణం కారణంగా రికార్డులను మార్చడం చాలా కష్టం, అందుకే ఇది ట్యాంపర్-ప్రూఫ్. బ్యాంకులు వంటి మధ్యవర్తులు అవసరం లేకుండానే డిజిటల్ లావాదేవీలు చేయడానికి ఇది సహాయపడుతుంది. భద్రత, పారదర్శకత, నమ్మకం వంటి లక్షణాల వల్ల క్రిప్టోకరెన్సీలు, ట్రాన్సాక్షన్ డేటా, టైమ్ స్టాంప్, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాల్లో బ్లాక్‌చెయిన్ పెద్దగా ఉపయోగపడుతుంది.

### బ్లాక్‌చైన్ ఎలా పని చేస్తుంది?

బ్లాక్‌చైన్ కార్యకలాపం నాలుగు ప్రధాన దశల్లో కొనసాగుతుంది:

1. ట్రాన్సాక్షన్ జరగడం : ఉదాహరణకు, ఒక వ్యక్తి డిజిటల్ మనీ పంపాదనుకుందాం. ఆ ట్రాన్సాక్షన్ నెట్‌వర్క్‌లో బ్రాడ్‌కాస్ట్ అవుతుంది.
2. నోడ్ల ద్వారా వెరిఫికేషన్ : బ్లాక్‌చైన్ నెట్‌వర్క్‌లో ఉన్న కంప్యూటర్లను నోడ్లు (Nodes) అంటారు. ఇవి ట్రాన్సాక్షన్

నిజంగా సరైనదా? నిబంధనలకు అనుగుణమా? అని చెక్ చేస్తాయి.

3. బ్లాక్‌లో రికార్డ్ చేయడం : వెరిఫికేషన్ పూర్తయ్యాక ట్రాన్సాక్షన్‌ను కొత్త బ్లాక్‌లో చేర్చుతారు. ఈ బ్లాక్‌కు ఒక ప్రత్యేకమైన హ్యాష్ కోడ్ ఉంటుంది.
4. గొలుసుకు బ్లాక్ జత చేయడం : కొత్త బ్లాక్, పూర్వపు బ్లాక్‌తో అనుసంధానమవుతుంది. ఈ లింక్ కారణంగా దీన్ని ఎవరూ మార్చలేరు.

ఈ ప్రక్రియ మొత్తం డిసెంట్రలైజేషన్, క్రిప్టోగ్రఫీ, కన్సెన్సస్ అల్గోరిథమ్స్ ద్వారా భద్రంగా జరుగుతుంది.

## బ్లాక్‌చైన్ టెక్నాలజీ ప్రధాన లక్షణాలు

1. డిసెంట్రలైజేషన్ : కేంద్ర ప్రభుత్వం, బ్యాంకు లేదా కంపెనీ వంటి ఏ సంస్థ నియంత్రణ లేకుండా నెట్‌వర్క్ నడుస్తుంది. ఇది స్వతంత్ర, ప్రజలకే చెందే టెక్నాలజీ.
2. పారదర్శకత : బ్లాక్‌చైన్‌లోని ట్రాన్సాక్షన్లు అందరికీ కనపడతాయి. కానీ వ్యక్తిగత వివరాలు మాత్రం గోప్యంగా ఉంటాయి.
3. భద్రత : ప్రతి ట్రాన్సాక్షన్‌ను క్రిప్టోగ్రఫీ రక్షిస్తుంది. డేటాను మార్చడం, తొలగించడం, హ్యాక్ చేయడం దాదాపు అసంభవం.
4. ఇమ్యూటబిలిటీ (Immutability) : ఒకసారి బ్లాక్ చేర్చిన తర్వాత దాన్ని ఎవరూ మార్చలేరు. ఈ లక్షణం బ్లాక్‌చైన్‌కు అత్యున్నత విశ్వసనీయతని ఇస్తుంది.
5. వేగం మరియు ఆటోమేషన్ : స్మార్ట్ కాంట్రాక్ట్‌లు (Smart Contracts) లేకుండా కూడా ఆటోమేటెడ్ ప్రాసెస్‌లు సులభంగా అమలవుతాయి.

## సాఫ్ట్‌వేర్ టెక్నాలజీలో బ్లాక్‌చైన్ ఉపయోగాలు

1. ఫైనాన్స్ & బ్యాంకింగ్ : అంతర్జాతీయ మనీ ట్రాన్స్‌ఫర్‌లను వేగంగా, తక్కువ ఖర్చుతో చేయగలదు. డిజిటల్ కరెన్సీలు (Bitcoin, Ethereum) బ్లాక్‌చైన్‌పై ఆధారపడుతున్నాయి.
2. IT మరియు సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ : డిసెంట్రలైజ్డ్ అప్లికేషన్లు (D Apps), సెక్యూర్ డేటా స్టోరేజ్, API సెక్యూరిటీ, లాగిన్ లేకుండా ఆధారపడని యూజర్ ఆథెంటికేషన్.
3. సప్లై చైన్ మేనేజ్‌మెంట్.
4. హెల్త్‌కేర్ : ఆరోగ్య రికార్డులను భద్రపరచడం, ఒక ఆస్పత్రి నుంచి మరొక ఆస్పత్రికి సురక్షితంగా షేర్ చేయడం, రోగి డేటా చేంజ్ కాకుండా కాపాడటం
5. గవర్నమెంట్ సేవలు : డిజిటల్ ఓటింగ్; రేషన్, ఆధార్, ల్యాండ్ రికార్డుల భద్రత; అవినీతిని తగ్గించే పారదర్శక వ్యవస్థలు; సర్కార్ రంగంలో బ్లాక్‌చైన్ కీలక పాత్ర పోషిస్తోంది.
6. విద్యా రంగం : సర్టిఫికేట్ వెరిఫికేషన్; ఫేక్ డిగ్రీలను నిరోధించడం; విద్యార్థుల రికార్డులను భద్రంగా నిల్వచేయడం.

## బ్లాక్‌చైన్ ప్రయోజనాలు

అత్యధిక భద్రత, తక్కువ ఖర్చు, వేగవంతమైన ట్రాన్సాక్షన్లు, డేటా ట్యాంపరింగ్ జరగదు, పూర్తి పారదర్శకత, గ్లోబల్ స్టాండర్డ్‌గా మారుతోంది.

## బ్లాక్‌చైన్ సవాళ్లు

అన్ని టెక్నాలజీల మాదిరిగానే దీనికి కూడా కొన్ని సమస్యలు ఉన్నాయి:

1. స్కేలబిలిటీ సమస్య : ట్రాన్సాక్షన్‌లు ఎక్కువైతే నెట్‌వర్క్ నెమ్మదిస్తుంది.
2. అధిక ఎనర్జీ వినియోగం : కొన్ని బ్లాక్‌చైన్‌లు (బిట్‌కాయిన్ వంటి) భారీ విద్యుత్ వినియోగిస్తాయి.
3. చట్టపరమైన సమస్యలు : క్రిప్టోకరెన్సీల నియంత్రణ దేశానిదేశం మారుతుంది.
4. టెక్నికల్ నైపుణ్యం కొరత : బ్లాక్‌చైన్‌లో నిపుణులైన డెవలపర్లు ఇంకా చాలా తక్కువ.

## ప్రపంచంలో బ్లాక్‌చైన్ పాత్ర

బ్లాక్‌చైన్ రాబోయే సంవత్సరాల్లో ఈ రంగాలను పూర్తిగా మార్చబోతోంది:


వెబ్ 3.0; మెటావర్స్‌జి; IoT సెక్యూరిటీ; డిజిటల్ ఐడెంటిటీ; డిసెంట్రలైజ్డ్ ఫైనాన్స్ (DeFi); NFT మార్కెట్.

బ్లాక్‌చైన్ టెక్నాలజీ ప్రపంచంలో అత్యంత విశ్వసనీయమైన, డేటా భద్రత కలిగిన, ఆర్థిక లావాదేవీలు, ప్రభుత్వ సేవలు, ఆరోగ్య సంరక్షణ వంటి అన్ని రంగాల్లో తన ప్రభావాన్ని చూపిస్తుంది. భవిష్యత్తులో ప్రపంచం మరింత డిజిటల్ వైపుకు పయనిస్తున్నపుడు, బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆ మార్పులో కేంద్రస్థానాన్ని సాధించడం ఖాయం.

– లత
e: ogshydcbse@gmail.com

కథ

# మానవతే మహాశక్తి




అనగనగా ఒక చిన్న గ్రామం. ఆ గ్రామం పేరు లక్ష్మీపురం. ఆ గ్రామం ఎప్పుడు పచ్చదనంతో పాడి పంటలతో కళకళలాడేది. పొలాలకు నీరందించేది ఒకే చెరువు. పశువులు, పంటలు, ఇళ్లందరికీ ఆ నీటే జీవం.

ఆ చెరువుపైనే గ్రామం ఆధారపడి ఉండేది. కానీ క్రమంగా కొన్ని మార్పులు జరిగాయి. కొందరు నిర్లక్ష్యంగా చెత్త విసరడం మొదలుపెట్టారు. ఒకసారి చనిపోయిన మేకను కూడా చెరువులో వేసేశారు. నీరు నల్లగా మారిపోయింది. వాసన వస్తూ అందరూ వాడేందుకు భయపడిపోయారు.

గ్రామస్తులు పరస్పరం నిందలు వేసుకుంటూ గొడవలు పెట్టుకున్నారు. “నువ్వే చెత్త వేసావు,” “నీ వల్లే ఇలా జరిగింది” అని తిట్టుకుంటూనే ఉన్నారు. కానీ ఎవ్వరూ ముందుకు వచ్చి చెరువును శుభ్రం చేయాలని అనుకోలేదు.

ఆ సమయంలో రామయ్య అనే ఒక పెద్దమనిషి ఆ చెరువు దగ్గరకి వచ్చాడు. వయసు ఎక్కువైనా, అతని మనసు మాత్రం బలంగా ఉండేది. చెరువును చూశాక అతని కళ్లలో నీళ్లు కదిలాయి. కొద్ది సేపు నిశ్శబ్దంగా నిలబడి, తనలోతనకు అన్నాడు: “ఈ చెరువు మన ఊరి ఊపిరి. దీన్ని ఇలా వదిలేస్తే మనమే చస్తాం. ఎవరో ఒకరు మొదలు పెట్టాలి... నేను మొదలుపెడతా.” అని చెప్పి తన కాలు మడతకట్టి చెరువులోకి దిగి, చెత్త తీయడం మొదలుపెట్టాడు.

మొదట చూసిన వారు నవ్వారు. “అతను వృద్ధుడు, ఏమి చేస్తాడు?” అని అనుకున్నారు. కానీ రామయ్య వయసును మరచిపోయి ఓర్పుతో చెత్త తొలగిస్తూనే ఉన్నాడు. అతని చేతులు మురికితో నిండిపోయాయి, కానీ అతని మనసు మాత్రం ధైర్యంతో నిండిపోయింది. చూస్తూ ఉన్న పిల్లలు ముందుకొచ్చారు. వారు కూడా చెత్తను సేకరించడం ప్రారంభించారు. కొంతసేపటికి కొందరు పెద్దలు సిగ్గుపడుతూ కలిసిపోయారు. కాస్త కాస్తగా గ్రామం మొత్తం అక్కడ చేరింది. ప్రతి ఒక్కరూ తమవంతు పని చేయడం మొదలుపెట్టారు. కొన్ని రోజుల్లో చెరువు మళ్లీ నిర్మలంగా మారింది. వర్షాకాలం రాగానే అది నిండిపొంగి, పొలాలకు నీరు అందించింది. పల్లె పచ్చగా కళకళలాడింది. పశువులు తృప్తిగా నీళ్లు తాగాయి.

గ్రామ పెద్దలు సభ పెట్టి రామయ్యని గౌరవించారు. “నీ ధైర్యం, నీ కర్తవ్యభావం వల్లే మన చెరువు తిరిగి బతికింది. నీ వల్లే మేము మళ్లీ జీవం పొందాం” అని అందరూ అన్నారు. రామయ్య మృదువుగా నవ్వుతూ అన్నాడు: “ఇది నా పని కాదు, ఇది మనందరి పని. మన దగ్గర ఉన్నదాన్ని కాపాడితే, పంచుకుంటే... అదే మానవతా విలువ.”

– వేధాంశ్ గౌడ్

7వ తరగతి, శ్రీ స్వామి నారాయణ్ గురుకుల్ ఇంటర్నేషనల్
డే స్కూల్, చేవెళ్ల రోడ్, మొయినాబాద్ మండలం,
రంగారెడ్డి జిల్లా
m : 99894 30830




# కలంచెలిమి



**తూర్పింటి భవిష్య సాగర్**
8వ తరగతి
చాణక్య హైస్కూల్, వనపర్తి.



**ఎ. నాగరాజు**
7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాజగోపాల్ పేట, నంగునూరు మండలం, సిద్ధిపేట జిల్లా.

**దీపర హాసిని**
7వ తరగతి, ఎంపియుపి స్కూల్, విజయనగరం జిల్లా.



**కుర్ర కీర్తన**
10వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అవునూరు.






**ఎస్. యషిక**
6వ తరగతి,
అరవింద హైస్కూల్,
గుంటూరు



**సుశాంత్**
10వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కులాస్ పూర్, మం: ముగ్పాల్, జిల్లా: నిజామాబాద్.

# భారతదేశం రాష్ట్ర ముఖ్యమంత్రులు & గవర్నర్లు




భారతదేశంలో మొత్తం 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలు ఉన్నాయి.

### ముఖ్యమంత్రి & గవర్నర్ నియామకం

ప్రజలు ఓటు వేసి ఎమ్మెల్యేలను ఎన్నుకుంటారు.

రాష్ట్ర శాసనసభలో మెజారిటీ పార్టీ ఎమ్మెల్యేలు తమ నాయకుడిని ముఖ్యమంత్రిగా ఎంపిక చేస్తారు. గవర్నర్ ఆ వ్యక్తిని అధికారికంగా ప్రకటిస్తారు.

గవర్నర్‌ను భారత రాష్ట్రపతి భారత రాజ్యాంగంలోని Article 155 ప్రకారం నియమిస్తారు. ప్రజలకు, ఎమ్మెల్యేలకు నేరుగా గవర్నర్ ఎన్నిక చేసే హక్కు ఉండదు.

కేంద్ర పాలిత ప్రాంతాల పాలన కేంద్ర ప్రభుత్వం నియమించిన లెఫ్టినెంట్ గవర్నర్/అడ్మినిస్ట్రేటర్ ద్వారా కొనసాగుతుంది.

ఫిబ్రవరి 13, 2025 నుండి మణిపూర్ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన కొనసాగుతుంది.

2025 వరకు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్ల వివరాలు తాజా జాబితాల ద్వారా తెలుసుకోవచ్చు.

### భారత రాష్ట్రాలు – రాజధానులు, ముఖ్యమంత్రులు & గవర్నర్లు 2025

| రాష్ట్రం | రాజధాని | ముఖ్యమంత్రి ఏ పార్టీకి చెందినవారో | గవర్నర్ | ముఖ్యమంత్రి | సరిహద్దులు |
|---|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | అమరావతి | తెలుగు దేశం పార్టీ | శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ | శ్రీ ఎన్. చంద్రబాబు నాయుడు | మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ |
| అరుణాచల్ ప్రదేశ్ | ఇటానగర్ | భారతీయ జనతా పార్టీ | శ్రీ కైవల్య త్రివిక్రమ్ పర్నాయక్ | శ్రీ పెమా ఖండు | అస్సాం, నాగాలాండ్ |
| అస్సాం | దిస్పూర్ | భారతీయ జనతా పార్టీ | శ్రీ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య | శ్రీ హిమంత బిశ్వ శర్మ | అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, త్రిపుర |
| బీహార్ | పాట్నా | జనతాదళ్ (యునైటెడ్) | శ్రీ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ | శ్రీ నితీష్ కుమార్ | జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ |
| ఛత్తీస్‌గఢ్ | నయా రాయ్‌పూర్ /బిలాస్‌పూర్ | భారత జాతీయ కాంగ్రెస్ | శ్రీ రామెన్ డేకా | శ్రీ విష్ణు దేవ్ సాయి | ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తరప్రదేశ్ |
| ఢిల్లీ | ఢిల్లీ (ఎన్‌సిటి) | భారతీయ జనతా పార్టీ | శ్రీ వినయ్ కుమార్ సక్సేనా | రేఖాగుప్తా | యు.పి., హర్యానా. |
| గోవా | పనాజి | భారతీయ జనతా పార్టీ | శ్రీ పి. అశోక్ గజపతిరాజు | శ్రీ ప్రమోద్ సావంత్ | మహారాష్ట్ర, కర్ణాటక |
| గుజరాత్ | గాంధీనగర్ | భారతీయ జనతా పార్టీ | ఆచార్య దేవవ్రత్ | శ్రీ భూపేంద్ర పటేల్ | రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ |

| | | | | | |
|---|---|---|---|---|---|
| హర్యానా | చండీగఢ్ | భారతీయ జనతా పార్టీ | శ్రీ ఆశీం కుమార్ గోష్ | శ్రీ నయాబ్ సింగ్ సైని | పంజాబ్, హిమాచల్, రాజస్థాన్ |
| హిమాచల్ ప్రదేశ్ | సిమ్లా | భారత జాతీయ కాంగ్రెస్ | శ్రీ శివ ప్రతాప్ శుక్లా | శ్రీ సుఖ్వీందర్ సింగ్ సుఖు | జమ్మూ కాశ్మీర్, పంజాబ్, హర్యానా |
| జార్ఖండ్ | రాంచీ | జార్ఖండ్ ముక్తి మోర్చా | శ్రీ సంతోష్ కుమార్ గంగ్వార్ | శ్రీ హేమంత్ సోరెన్ | ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ |
| కర్ణాటక | బెంగళూరు | భారతీయ జనతా పార్టీ | శ్రీ థావర్చంద్ గెహ్లాట్ | శ్రీ సిద్ధరామయ్య | గోవా, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ |
| కేరళ | తిరువనంతపురం | భారత కమ్యూనిస్ట్ పార్టీ | శ్రీ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ | శ్రీ పినరయి విజయన్ | కర్ణాటక, తమిళనాడు |
| మధ్యప్రదేశ్ | భోపాల్ | భారతీయ జనతా పార్టీ | మంగుభాయ్ ఛగన్భాయ్ పటేల్ | శ్రీ మోహన్ యాదవ్ | ఉత్తరప్రదేశ్, ఛత్తీస్గఢ్, గుజరాత్, రాజస్థాన్ |
| మహారాష్ట్ర | ముంబై | శివసేన | ఆచార్య దేవవ్రత్ | శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్ | గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్గఢ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గోవా |
| మణిపూర్ | ఇంఫాల్ | భారతీయ జనతా పార్టీ | శ్రీ అజయ్ కుమార్ భల్లా | ప్రెసిడెంట్ రూల్ | నాగాలాండ్, మిజోరం, అస్సాం |
| మేఘాలయ | షిల్లాంగ్ | నేషనల్ పీపుల్స్ పార్టీ | శ్రీ సి.హెచ్. విజయశంకర్ | కాన్రాడ్ కొంగ్కల్ సంగ్మా | అస్సాం |
| మిజోరం | ఐజ్వాల్ | మిజో నేషనల్ ఫ్రంట్ | జనరల్ (డా.) విజయ్ కుమార్ సింగ్ PVSM, AVSM, YSM (రిటైర్డ్.) | శ్రీ పి.యు. లాల్దుహోమా | అస్సాం, మణిపూర్, త్రిపుర |
| నాగాలాండ్ | కోహిమా | నేషనలిస్ట్ డెమోక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ | శ్రీ అజయ్ కుమార్ భల్లా | శ్రీ నీఫియు రియో | అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్ |
| ఒడిశా | భువనేశ్వర్ | బిజు జనతా దళ్ (బిజెడి) | డాక్టర్ హరి బాబు కంభంపాటి | శ్రీ మోహన్ చరణ్ మాఝి | ఛత్తీస్గఢ్, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ |
| పంజాబ్ | చండీగఢ్ | ఆమ్ ఆద్మీ పార్టీ | శ్రీ గులాబ్ చంద్ కటారియా | శ్రీ భగవంత్ సింగ్ మాన్ | చండీగఢ్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ & కాశ్మీర్, రాజస్థాన్ |
| రాజస్థాన్ | జైపూర్ | భారత జాతీయ కాంగ్రెస్ | శ్రీ హరిభావు కిషన్రావ్ బాగ్డే | శ్రీ భజన్ లాల్ శర్మ | గుజరాత్, హర్యానా, పంజాబ్ |
| సిక్కిం | గాంగ్టక్ | సిక్కిం క్రాంతికారి మోర్చా (SKM) | శ్రీ ఓం ప్రకాష్ మాథుర్ | శ్రీ ప్రేమ్ సింగ్ తమాంగ్ (గోలే) | పశ్చిమ బెంగాల్ |
| తమిళనాడు | చెన్నై | ద్రవిడ మున్నేట్ర కజగం | శ్రీ ఆర్.ఎన్. రవి | ఎంకే స్టాలిన్ | కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ |
| తెలంగాణ | హైదరాబాద్ | భారత రాష్ట్ర సమితి | శ్రీ జిష్ణు దేవ్ వర్మ | శ్రీ ఎ రేవంత్ రెడ్డి | ఆంధ్రప్రదేశ్, కర్ణాటక |
| త్రిపుర | అగర్తల | భారతీయ జనతా పార్టీ | శ్రీ ఇంద్ర సేన రెడ్డి నల్లు | శ్రీ మాణిక్ సాహా | అస్సాం, మిజోరం |
| ఉత్తర ప్రదేశ్ | లక్నో | భారతీయ జనతా పార్టీ | శ్రీమతి ఆనందిబెన్ పటేల్ | శ్రీ యోగి ఆదిత్యనాథ్ | బీహార్, ఛత్తీస్గఢ్, హర్యానా, జార్ఖండ్ |
| ఉత్తరాఖండ్ | డెహ్రాడూన్ | భారతీయ జనతా పార్టీ | లెఫ్టినెంట్ జనరల్. గుర్మీత్ సింగ్ PVSM, UYSM, AVSM, VSM (రిటైర్డ్.) | శ్రీ పుష్కర్ సింగ్ ధామి | ఉత్తర ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ |
| పశ్చిమ బెంగాల్ | కోల్కతా | ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ | డాక్టర్ సి.వి. ఆనంద బోస్ | శ్రీ మమతా బెనర్జీ | ఒడిశా, జార్ఖండ్, బీహార్, సిక్కిం |

**కేంద్రపాలిత ప్రాంతాలు**

| కేంద్రపాలిత ప్రాంతం | రాజధాని | లెఫ్టినెంట్ గవర్నర్ |
|---|---|---|
| అండమాన్ & నికోబార్ | పోర్ట్ బ్లెయిర్ | శ్రీ దేవేంద్ర కుమార్ జోషి (లెఫ్టినెంట్ గవర్నర్) |
| చండీగఢ్ | చండీగఢ్ | శ్రీ గులాబ్ చంద్ కటారియా |
| దాద్రా, నాగర్ హవేలి, డామన్ మరియు దయ్యు | డామన్ | శ్రీ ప్రఫుల్ ఖోడా పటేల్ (అడ్మినిస్ట్రేటర్) |
| ఢిల్లీ (జాతీయ రాజధాని ప్రాంతం ఢిల్లీ) | న్యూఢిల్లీ | శ్రీ వినయ్ కుమార్ సక్సేనా (లెఫ్టినెంట్ గవర్నర్) |
| జమ్మూ కాశ్మీర్ | శ్రీనగర్ (మే-అక్టోబర్) జమ్మూ (నవంబర్-ఏప్రిల్) | శ్రీ ఒమర్ అబ్దుల్లా |
| లక్షద్వీప్ | కవరట్టి | శ్రీ ప్రఫుల్ ఖోడా పటేల్ (లెఫ్టినెంట్ గవర్నర్) |
| పుదుచ్చేరి | పుదుచ్చేరి | శ్రీ కె. కైలాసనాథన్ |
| లడఖ్ | లెహ్ | శ్రీ కవిందర్ గుప్తా (లెఫ్టినెంట్ గవర్నర్) |

- బాలచెలిమి డెస్క్

చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాలచెలిమి గ్రంథాలయం

## జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అనంత సాగర్

# అక్షర మాత సన్నిధి - అపూర్వ విజ్ఞాన నిధి

సిద్దిపేట జిల్లా చిన్న కోడూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనంతసాగర్‌లో 21-08-2025 రోజున బాల చెలిమి గ్రంథాలయాన్ని చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్, దక్కన్ ల్యాండ్ పత్రిక సంపాదకులు శ్రీ మణికొండ

వేదకుమార్ గారు ప్రారంభించారు. బాల చెలిమి కన్వీనర్ శ్రీ గరిపెల్లి అశోక్ గారి కృషి ఫలితంగా బాల చెలిమి గ్రంథాలయం ఏర్పాటు చేయడం జరిగినది. సుమారు 20 వేల రూపాయల విలువ చేసే పుస్తకాలను అందజేసి విద్యార్థులలో పఠనాసక్తిని పెంపొందించే అద్భుతమైన సాధనంగా బాల చెలిమి గ్రంథాలయం సహాయ పడగలదని వేదకుమార్ సర్ సూచించారు.

పాఠశాల సమయం గ్రంథాలయ సందర్శనకు ఏర్పాటు చేయడం జరిగింది. విద్యార్థులు గ్రంథాలయానికి వెళ్లి, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పుస్తకాలు చదువుచున్నారు. పుస్తకాలలోని ముఖ్యాంశాలను విద్యార్థులు నోటు చేస్తున్నారు. గ్రంథాలయాన్ని ఉపయోగిస్తున్న విద్యార్థులు సాహిత్య పోటీల్లో రాణిస్తున్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులు చదువుతో పాటుగా సృజనాత్మక శక్తిని పెంచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. స్మార్టుఫోన్‌లు అందుబాటులోకి వచ్చిన తరుణంలో పిల్లలు పెద్దలు అందరూ సెల్‌ఫోన్‌లకు అంకితం అయిన ఈ పరిస్థితుల్లో పుస్తక పఠనంపై అభిరుచిని పెంపొందించడానికి బాల చెలిమి ఉపయోగపడడం శుభపరిణామం. అందుకు వేదకుమార్ సర్ గారికి కృతజ్ఞతలు. **- కె. జ్యోతి,** ప్రధానోపాధ్యాయురాలు.

### ఉపాధ్యాయుల స్పందన :

పుస్తక పఠనం వల్ల విద్యార్థుల్లో అజ్ఞానం తొలగి విజ్ఞానం, వివేకం, సృజనాత్మకత, లక్షణాలు పెంపొందుతాయి.

**- వి. కవిత,** గణితశాస్త్ర ఉపాధ్యాయులు

విజ్ఞాన, వినోద, సాహిత్య అంశాల్లో విద్యార్థులు తగిన జ్ఞానము పొందడంలో బాల చెలిమి ఒక గురువు వలె మార్గదర్శనం చేస్తుంది. **- బి. దుర్గయ్య,** హిందీ ఉపాధ్యాయులు



పుస్తక పఠనంతో విద్యార్థుల్లో సామాజిక, మానసిక పరిపక్వత వికాసం అభివృద్ధికి దోహదపడుతుంది.

**- వి. నరేష్,** సామాజిక ఉపాధ్యాయులు.

చదువు సంస్కారం నేర్పుతుంది. పుస్తకపఠనం ద్వారా వివిధ రకాల వృక్షాలు, జీవుల స్థితిగతులు గ్రహించవచ్చు.

**- బి. సమ్మయ్య,** జీవశాస్త్ర ఉపాధ్యాయులు

విజ్ఞాన శాస్త్ర అంశాలు, శాస్త్ర వేత్తల జీవిత విశేషాలు ప్రయోగాలు తెలుసుకోవచ్చు.

**- ఎల్.టి. శ్రీదేవి,** సైన్స్ ఉపాధ్యాయులు.

పుస్తక పఠనం విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతంగా ఎదగడానికి సహకరిస్తాయి. **- ఎ. రమణ,** ఆంగ్ల ఉపాధ్యాయులు

### విద్యార్థుల స్పందన :

బాల చెలిమి గ్రంథాలయం ద్వారా మేము ప్రతిరోజూ కథలు చదువుతూ, జ్ఞానాన్ని పొందుతున్నాము. వివిధ సాహితీ సంస్థల పోటీల్లో పాల్గొని బహుమతులు గెలుచుకునే అవకాశం లభించింది. **- బి. విశ్వతేజ,** 7వ తరగతి

గ్రంథాలయాల ద్వారా ఎన్నో రకాల పుస్తకాలు చదువుకునే అవకాశం కలిగింది. **- బి. అఖిల,** 8వ తరగతి

పుస్తకాలు చదవడం వలన లోకంలోని చాలా విషయాలు తెలుసుకోవచ్చును. **- టి. తనుశ్రీ,** 8వ తరగతి

కథల పుస్తకాలను, మహానుభావుల జీవిత చరిత్రలను చదువుకునే అవకాశం లభించింది. **- సిహెచ్. అక్షర,** 7వ తరగతి

**- శ్రీ కోణం పర్శరాములు**
తెలుగు ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
అనంత సాగర్, చిన్న కోడూరు, సిద్దిపేట
m : 9959524585



# పగడపు తీగల రక్షకుడు, సముద్ర సౌందర్యానికి ప్రతీక
# హాక్స్‌బిల్ తాబేలు

హాక్స్‌బిల్ తాబేలు (Eretmochelys imbricata) ఒక అరుదైన, అద్భుతమైన సముద్ర తాబేలు జాతి. ఇది ప్రపంచంలోని ఉష్ణ మండల సముద్ర ప్రాంతాల్లో, ముఖ్యంగా పగడపు తీగలు (coral reefs) ఉన్న ప్రాంతంలో కనిపిస్తుంది. వీటి నోరు గద్ద ముక్కులా ఉండటం వల్ల వీటిని "హాక్స్‌బిల్" అని పిలుస్తారు. ఈ ముక్కు వీటికి పగడపు రాళ్ల మధ్య దాక్కున్న ఆహారాన్ని తినడానికి సహాయపడుతుంది. వీటి గూడు (shell) బంగారు, గోధుమ, నలుపు రంగు అందమైన ఆకృతులతో ఉంటుంది. ఈ గూడులను "టార్టాయిస్ షెల్" అని పిలుస్తారు, ఇది ఆభరణాలు మరియు అలంకార వస్తువుల తయారీలో వాడటం వల్ల ఈ తాబేళ్లు ఎక్కువగా వేటకు గురవుతున్నాయి.

హాక్స్‌బిల్ తాబేళ్లు ప్రధానంగా స్పాంజ్‌లను తింటాయి. వీటితో పాటు సముద్రపు మొక్కలు, జెల్లీఫిష్, చిన్న సముద్ర జీవులు కూడా వీటి ఆహారంలో భాగం. ఇవి పగడపు తీగలలో స్పాంజ్‌ల సంఖ్యను నియంత్రించడం ద్వారా సముద్ర పర్యావరణ సమతుల్యాన్ని కాపాడుతాయి. ఈ కారణంగా హాక్స్‌బిల్ తాబేళ్లు సముద్ర జీవావరణానికి చాలా ముఖ్యమైనవి.

ఆడ తాబేళ్లు, తాను పుట్టిన అదే తీరానికి తిరిగి వచ్చి గూడు కట్టి గుడ్లు పెడతాయి. ప్రతి గూడులో దాదాపు 100 నుంచి 200 గుడ్లు ఉంటాయి. సుమారు 60 రోజుల తర్వాత ఆ గుడ్ల నుండి పిల్లలు బయటకు వస్తాయి. చిన్న తాబేళ్లు రాత్రివేళ చంద్రుని కాంతిని అనుసరించి సముద్రం వైపు కదిలిపోతాయి. కానీ వీటిలో చాలా తక్కువమంది మాత్రమే పెద్దవిగా ఎదుగుతాయి. ఎందుకంటే సముద్రంలో వీటిని తినే శత్రువులు ఎక్కువగా ఉంటాయి.

హాక్స్‌బిల్ తాబేళ్లు ఇప్పుడు "తీవ్రంగా ప్రమాదంలో ఉన్న జాతి"గా (Critically Endangered) గుర్తించ బడింది వీటికి ప్రధాన ముప్పులు తీర ప్రాంతాల అభివృద్ధి వల్ల గూడు పెట్టే ప్రదేశాల నాశనం, వాతావరణ మార్పులు, ప్లాస్టిక్ కాలుష్యం, మరియు మత్స్య వలలో చిక్కుకోవడం. వీటిని రక్షించడానికి అనేక దేశాలు గూళ్ల సంరక్షణ, సముద్ర రక్షిత ప్రాంతాల ఏర్పాటు, మరియు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. మనం కూడా సముద్రాన్ని స్వచ్ఛంగా ఉంచి, ఈ తాబేళ్ల రక్షణలో భాగస్వామ్యం కావాలి.

ఈ తాబేళ్లను కాపాడటం అనేది కేవలం ఒక జాతిని రక్షించడం మాత్రమే కాదు, సముద్ర జీవ వ్యవస్థను కాపాడటానికి ఒక పెద్ద అడుగు కూడా.

– సచిన్ కోత్వాల్

బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక

# జాతీయ బాలచెలిమి కథల పోటీ ఫలితాలు - 2025

చిల్డ్రన్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాల చెలిమి సంపాదకులు శ్రీ మణికొండ వేదకుమార్ మార్గదర్శకత్వంలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ స్థాయి కథల పోటీని నిర్వహించింది. బాలల్లో విజ్ఞానం, వినోదం, వికాసం పెంపొందించాలనే లక్ష్యంతో గత కొన్నేళ్లుగా బాల చెలిమి ముచ్చట్లు, కథల సంకలనాలు, పర్యావరణ కథల పోటీలను నిర్వహిస్తూ వస్తోంది. ఈ స్ఫూర్తితో ఆకర్షణీయంగా రూపొందించిన బాలచెలిమి మాసపత్రికను ప్రచురిస్తోంది.

తాజా కథల పోటీలకు రెండు రాష్ట్రాల నుంచీ విశేష స్పందన లభించింది. పెద్దలు 214 కథలు, పిల్లలు 714 కథలు, యువతరం 48 కథలు పంపారు. నిపుణుల బృందం ఉత్తమ కథలను ఎంపిక చేసింది. విజేతలకు సమాన నగదు బహుమతులు త్వరలో అందజేయబడతాయి. ఎంపికైన కథలను పలు సంకలనాలుగా ప్రచురించడమే కాకుండా, ప్రచురణకు అనువైన కథలు బాల చెలిమి పిల్లల పత్రికలో కూడా ప్రచురించబడతాయి.

పోటీలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు, విజేతలకు అభినందనలు.

## పెద్దలు రాసిన పిల్లల కథలు

| | | |
|---|---|---|
| గడువు | – | ఆకెళ్ల వేంకట సుబ్బలక్ష్మి, హైదరాబాద్ |
| అదృశ్య దేవత | – | ఓట్ర ప్రకాష్ రావు, తిరుత్తణి |
| చందమామపై షికారు | – | కె.వి. సుమలత, గుడివాడ |
| ఆరోగ్యమే మహాయోగం | – | చెన్నూరి సుదర్శన్, హైదరాబాద్ |
| ప్రయాణం నేర్పిన పాఠం | – | జొన్నలగడ్డ శ్యామల, హైదరాబాద్ |
| ప్రార్థించే పెదవుల కన్నా | – | నంద త్రినాథరావు, పాట్నా |
| స్నేహ మధురిమ | – | పి.ఎల్.ఎన్. మంగారత్నం, కాకినాడ |
| వనదేవత | – | పుప్పాల కృష్ణమూర్తి, కోదాడ |
| గూడు మార్చిన కాకి | – | పోరెడ్డి అశోక్, ఆదిలాబాద్ |
| పుష్పవిలాసం | – | భమిడిపాటి విజయలక్ష్మి, నెల్లూరు |

| | | |
|---|---|---|
| రాజు చేసిన మేలు | – | బి.వి. పట్నాయక్, పార్వతీపురం |
| చిగురించిన విలువలు | – | మద్దిరాల శ్రీనివాసులు, ఒంగోలు |
| వెన్నెల | – | వి. శాంతి ప్రబోధ, హైదరాబాద్ |
| చిన్న విత్తనం – మహావృక్షం | – | వెంగళ నరేష్, అనంతసాగర్ |
| ఫలించిన సాయం | – | సంగనభట్ల చినరామకిష్టయ్య, ధర్మపురి |

## యువతరం రాసిన పిల్లల కథలు

| | | |
|---|---|---|
| చెట్టు ఉపకారం | – | కట్టోజు నీరజ, సిద్దిపేట |
| బతుకమ్మ | – | కె. పావని, హైదరాబాద్ |
| వ్యవసాయం | – | గీస శ్రీజ, అదిలాబాద్ |
| అమ్మో కోతులు | – | చిలుకూరి హరినందన, హైదరాబాద్ |
| గురుదక్షిణ | – | పుల్లా మురళీ ఆకాష్, కర్నూలు |

## బడిపిల్లలు రాసిన కథలు

| | | |
|---|---|---|
| చేయూత | – | ఈ. రేణుక, డోను |
| ప్లాస్టిక్ వాడిన రవి | – | వి. రోహిత్, మంగళగిరి |
| మూఢ నమ్మకాలు | – | గంగారపు శృతి, నర్సింలపల్లె |
| బట్ట సంచి | – | గుగ్లోత్ పూజ, హవేలిఘనపూర్ |
| నిర్లక్ష్యం | – | జీరు హరిక, గరివిడి |
| హెల్మెట్ | – | డి. స్నేతిక, రాంపూర్ |
| అల్లరి కోతి | – | ధీరెన్ వంగా, హైదరాబాద్ |
| పట్టుదల | – | తనూజ – బైరాగి పట్టేడ తిరుపతి |
| మట్టి గణపతి | – | తల్లెల కీర్తి, లక్ష్మీపూర్ |
| మతం | – | పి. ఆశీష్, మొయినాబాద్ |
| ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం | – | భూక్యా వర్షిత, పాలకొల్లు |
| ఊరు చేసిన తప్పు | – | బొక్కల విశ్వతేజ, అనంతసాగర్ |
| మూఢనమ్మకాల ముప్పు | – | ఎం. మహాలక్ష్మీ, మేళ్లచెర్వు |
| రంగుల కలలు | – | ఎస్. శ్రీవర్ధన్, నల్లగొండ |
| పుస్తకం కోసం పోరాటం | – | సి.హెచ్. అభిషేక్, స్టేషన్ ఘనపూర్ |
| సహకారం | – | సి.హెచ్. బ్రాహ్మణి, నెల్లూరు |

– గరిపల్లి అశోక్
కన్వీనర్, బాలచెలిమి
m : 9849649101

## బాలచెలిమి మినీ గ్రంథాలయం



జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా నల్గొండ జిల్లా, దేవరకొండ మండలం, తాటికోల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలచెలిమి మినీ గ్రంథాలయాన్ని ప్రధానోపాధ్యాయులు జె. బక్కయ్య గారు రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. హెచ్.ఎమ్. మాట్లాడుతూ, "Children's Education కోసం బాలచెలిమి వారు మినీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడంలో అందించిన సహకారం అభినందనీయం. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ జ్ఞానాన్ని విస్తరించు కోవాలి" అని సూచించారు. అలాగే బాలచెలిమి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాలచెలిమి స్ఫూర్తితో బాలల దినోత్సవ ఉత్సాహం




వనపర్తి జిల్లా పానుగల్ జెడ్పీహెచ్ఎస్‌లో బాలచెలిమి ఆధ్వర్యంలో బాలల హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కథల పోటీలు నిర్వహించి విజేతలకు పుస్తకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. బాలచెలిమి గ్రంథాలయం ద్వారా విద్యార్థుల్లో పఠనాభిరుచి, జిజ్ఞాస పెరుగుతున్నదని అధికారులు ప్రశంసించారు. డ్రగ్ కల్చర్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించి, పిల్లలు భయరహిత వాతావరణంలో చదవాలని సూచించారు. విద్యార్థుల ఆటపాటలతో కార్యక్రమం ముగిసింది.

## గోల్కొండ కోటలో 'గొల్లకొండ కథ' గ్రాఫిక్ నవల ఆవిష్కరణ



డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్ట్, ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ ఆధ్వర్యంలో మంచి పుస్తకం సంస్థ నవంబర్ 15, 2025న గోల్కొండ కోటలో హెరిటేజ్ వాక్‌ను నిర్వహించింది. పాల్గొన్నవారికి గోల్కొండ కోట నిర్మాణ విశిష్టత, ప్రత్యేక శైలి, నీటి వనరుల నిర్వహణ వంటి అంశాలు కన్జర్వేషన్ ఆర్కిటెక్ట్ తాన్యా శ్రీవాస్తవ వివరించారు. వాక్ అనంతరం ప్రముఖ విద్యావేత్త, దక్కన్ ల్యాండ్ మరియు బాలచెలిమి సంపాదకులు మణికొండ వేద కుమార్ 'గొల్లకొండ కథ: గోల్కొండ వైభవం, పతనం' గ్రాఫిక్ నవలను ఆవిష్కరించారు. రచయిత నిఖిల్ గులాటి రచనను తెలుగులో అందంగా అనువదించిన వి. ఎస్. పవిత్రల కృషిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మేధావులు, విద్యావేత్తలు, రచయితలు, వారసత్వ ప్రేమికులు, విద్యార్థులు, పర్యాటకులతో పాటు సహకరించిన ప్రతి ఒక్కరికి మంచి పుస్తకం సంస్థకు చెందిన పి. భాగ్యలక్ష్మి, కె. సురేష్ ధన్యవాదాలు తెలిపారు.

## పెందోట సాహిత్య పురస్కారాలు-2024


తేది: 18-11-2025, సిద్దిపేట: పెందోట బాల సాహిత్య పీఠము-శ్రీవాణి సాహిత్య పరిషత్తు అధ్యక్షులు పెందోట వెంకటేశ్వర్లు 2024 సంవత్సరానికి గాను పెందోట సాహిత్య పురస్కారాలను ప్రకటించారు. పిల్లల జాబిల్లి, చిగురింతలు, తారాజువ్వలు, వెన్నల్లో మా పల్లె, కథా చంద్రిక, గురువు మాట వంటి మొత్తం పది రచనలు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. అలాగే బాల కథల పోటీ-2025 ఫలితాలు కూడా విడుదల చేశారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, ప్రోత్సాహ బహుమతుల విజేతలను ప్రకటిస్తూ భవిష్యత్తులో మరింత మంది చిన్నారులు కథారచనలో పాల్గొనాలని కోరారు.

- బాలచెలిమి డెస్క్

# గ్రామీణ సాంస్కృతిక జ్ఞాపకాల ప్రతిరూపం:
# పద్మశ్రీ షేక్ నాజర్

బుర్రకథ అనేది తెలుగు జానపద కళారూపాలలో అత్యంత ప్రాచీనమైనదిగా, ప్రజల జీవనానికి దగ్గరగా ఉండే కళా ప్రక్రియ. పాటలు, పద్యాలు, వాద్యాలు, హాస్యాలు, పల్లెపదాలు, సామెతలు అన్నీ కలిపి వినేవారిని అలరించేలా, ఆలోచింపజేసేలా నడిచే కళా వైభవం బుర్రకథ. హరికథలో సంప్రదాయ శాస్త్రీయ లక్షణాలు ఉన్నప్పటికీ, బుర్రకథ మాత్రం పూర్తిగా ప్రజల భాష, పల్లె వాతావరణం, సామాన్యుల భావవ్యక్తీకరణలతో నిండి ఉంటుంది. ఈ కళారూపానికి కొత్త ఆకృతి, వినూత్న శైలి, ప్రజాబలం తీసుకొచ్చిన మహానటుడు, మహాకథకుడు 'బుర్రకథ పితామహుడు' షేక్ నాజర్.

1920 ఫిబ్రవరి 5న గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో బీబాబ్, షేక్ మస్తాన్ దంపతులకు నాజర్ జన్మించాడు. చిన్నతనంలో చదువుపై పెద్ద ఆసక్తి లేకపోయినా, సంగీతం, పాటలు, రాగాలపై అతనికి విపరీతమైన మక్కువ. విన్న పాటను ఒక్కసారిలోనే గుర్తుంచుకునే ప్రతిభ అతనికి సహజసిద్ధమైన వరం. ఈ ప్రతిభతోనే చిన్న వయసులోనే చెక్కభజన కార్యక్రమాల్లో పాల్గొని మంచి పేరు సంపాదించాడు. ఆ తరువాత మంగళగిరిలో మురుగుళ్ల సీతారామయ్య వద్ద హార్మోనియం నేర్చుకోవడం, ముట్లూరు కోటి వీరయ్య వద్ద శాస్త్రీయ రాగాలు అభ్యసించడం వంటి శిక్షణ అతని సంగీత పునాదిని బలోపేతం చేసాయి. నాజర్ కళాజీవిత తొలి దశ నాటక రంగంలోనే ప్రారంభమైంది. 'కృష్ణలీల'లో దేవకి, 'భక్త రామదాసు'లో ఛాందిని, 'పాదుకా పట్టాభిషేకం'లో కైకేయి, 'ఖిల్జీ రాజ్యపతనం'లో కమలారాణి, 'శ్రీకృష్ణ రాయబారం'లో రుక్మిణి వంటి అనేక స్త్రీ పాత్రలను అద్భుతంగా పోషించి ప్రేక్షకుల ప్రశంసలు పొందాడు. అతని స్వరం, నటన నైపుణ్యం, శరీర భాష, అన్నింటిని కలిపి అతన్ని ప్రత్యేక నటుడిగా నిలబెట్టాయి.



తెనాలి బాలరత్న నాటక సమాజం నుండి ప్రారంభమైన నాజర్ బుర్రకథ ప్రయాణం నాలుగు దశాబ్దాలపాటు సాగి, తెలుగు బుర్రకథ చరిత్రలో స్వర్ణయుగంగా నిలిచింది. ప్రజలు అర్థం చేసుకునే భాషలో, సహజమైన పల్లె పదాలతో, హాస్యంతో, ఆ పాతకాలపు కథలను సరికొత్తగా అలవరచి, కథలలో సమాజాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దడంలో నాజర్‌కు ఎవరు సమానం లేరు. ఆయన ప్రదర్శనలో కథ, పాట, పల్లవులు అన్నీ ఒకే తీరుగా మమేకమై వినేవారిని పూర్తిగా ఆకట్టుకునేవి.

తరువాత కమ్యూనిస్టు పార్టీలో చేరిన నాజర్, ప్రజానాట్య మండలి వేదికగా బుర్రకథను సామాజిక-రాజకీయ చైతన్యానికి సాధనంగా మలిచాడు. బుర్రకథను వినోదంతో పాటు సామాజిక అవగాహన రేకెత్తించే ఆయుధంగా తీర్చిదిద్దాడు. పల్నాటి యుద్ధం, వీరాభిమన్యు, బొబ్బిలి యుద్ధం, అల్లూరి సీతారామరాజు, ప్రహ్లాద, క్రీస్తు, బెంగాల్ కరువు వంటి ఇతివృత్తాలను ఆధునిక రాజకీయ దృక్కోణాలతో ముడిపెట్టి కొత్త తరహా బుర్రకథలను రూపొందించాడు. కౌలు దారుల సమస్యలు, కార్మిక లోపాలు, సామాజిక అన్యాయం వంటి అంశాలను కథలో నైపుణ్యంగా మేళవించాడు. అతని రచన 'అసామి' నాటకం అప్పట్లో విశేష ప్రాచుర్యం పొందింది. సినీ రంగంలో కూడా నాజర్ తన గాత్రం, కథా శైలితో గుర్తింపు తెచ్చుకున్నాడు. 'పుట్టిల్లు', 'అగ్గిరాముడు' వంటి చిత్రాల్లో బుర్రకథలు చెప్పి ప్రేక్షకులను అలరించాడు. 'నిలువుదోపిడి', 'పెత్తందార్లు' చిత్రాలకు కూడా ఆయన తన సేవలను అందించాడు.

కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల అనేకసార్లు జైలుశిక్షలు అనుభవించినా, నాజర్ తన కళాబాటను అసలు విడిచిపెట్టలేదు. ప్రజల కోసం, కళ కోసం తాను పుట్టినట్టు భావించి జీవితాన్ని అంకితం చేశాడు. 1981లో ఆంధ్ర నాటక కళాపరిషత్ ఉత్తమ కళాకారుడి పురస్కారంతో ఆయన సేవలు సత్కరించబడ్డాయి. 1986లో కేంద్ర ప్రభుత్వం నుండి ప్రతిష్ఠాత్మక 'పద్మశ్రీ' బిరుదు లభించడం ఆయన కళాజీవితానికి గొప్ప గౌరవం. 1997 ఫిబ్రవరి 22న అంగలూరులో 77 ఏళ్ల వయస్సులో నాజర్ చివరి శ్వాస విడిచారు. కానీ ఆయన బుర్రకథకు అందించిన సేవలు, ఆయన వినూత్న శైలి, ప్రజల గుండెల్లో నాటుకున్న స్వరం తెలుగు జానపద సంస్కృతిలో ఎప్పటికీ నిలిచిపోతాయి. బుర్రకథ అంటే నాజర్ అనే పేరు సర్వత్ర గుర్తుండిపోవడం ఆయన మహోన్నత కళాప్రతిభకు నిదర్శనం.

– సువేగా

# CENTRAL BOOK SHOP

**ABIDS**
5-9-186, Behind SBH(H.O)
Gunfoundry, Hyd-1.
Ph: 66468646,23203108

**AMEERPET**
Lane Opp.Green Park Hotel,
Hyderabad.
Ph: 2340 0789

CBS Global Service
CENTRAL BOOK SHOP
ABIDS / AMEERPET

- **SCHOOL BOOKS**
- **GENERAL BOOKS**
- **STATIONARY & GIFTS**





Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

BALA CHELIMI, Telugu Children's Monthly Magazine
Date of Publication: 23rd Every Month
Postal Dates: 24th & 26th Every Month
Posting at BPC IV, Patrika Channel, Nampally, Hyderabad-500001.

RNI Regn. No. 52828/1992 TC No. TELTEL01232
Postal Regn.No.HCD-5022/2024-2026


# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## ప్రచురణలు

**38 పుస్తకాల ధర రూ.1630 • తగ్గింపు ధర రూ. 1450**

### తెలంగాణ బడి పిల్లల కథలు

10 పుస్తకాల సెట్ ధర రూ.330 తగ్గింపు ధర రూ. 300



### పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)

10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300



### చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు

18 పుస్తకాల ధర రూ.950 • తగ్గింపు ధర రూ. 850



పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

**Account Details :**
Account Name : Bala Chelimi
Bank Name : Canara Bank
A/c. No. : 30101010003714
Branch : Ashoknagar, Hyderabad.
IFSC Code : CNRB0013010

ప్రతులకు
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
email: edit.chelimi@gmail.com website : www.balachelimi.com

SCAN & PAY


Printed at : Deccan Press, Azamabad, Hyderabad-20, Ph : 90599 50055

Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com